TPLA 1300 B 190
7 2/5
A
1987
G-215

# సరే, కానివ్వండి

(కథల సంపుటి)

శ్రీ వేమన గ్రంధాలయమ్
తేలప్రోలు. (కృష్ణా జిల్లా.)

గోపీచంద్

ప్రథమ ముద్రణ
1947 జనవరి

B

వెల రూపాయి

*Printed at Nalanda Press, Tenali G 98 C. 1000 D/ 1—1—47*
*For Praja Sahitya Parishat, Tenali. G. 79*

1

# బుడతకీచు

కాలప్రవాహం అతి వేగంగా ప్రవహిస్తూ వుంది. అందులో భూత వర్తమాన భవిష్యత్ కాలాలున్నాయి. వాటిని చూచినవాళ్లు ఎవ్వరూ లేరు. ఉన్నాయని మాత్రం అందరి నమ్మకం.

ఒక సమయంలో దూర్వాసోముని ఆకాశంలో ప్రయాణం చేస్తూ, భూలోకంలోవున్న ఈ కాలప్రవాహాన్ని చూచి ఆశ్చర్య పడ్డాడు. ఇటువంటి ప్రవాహం ఆయన ఇంతవరకు ఎన్నడూ, ఎక్కడా చూచి వుండలేదు. స్వర్గంలో కాలప్రవాహం లేదు. మందాకిని వుంది. నరకంలో వుంది వైతరిణి. మందాకిని ఉలకదు: పలకదు. వైతరిణి కదలదు: మెదలదు.

ఈ విధంగా దూర్వాసోముని ఆశ్చర్య పడినవాడై, త్రిలోక సంచారియగు నారద మౌనిని పిలిచి అడిగాడు.

"ఏమిటది?"

"ప్రవాహం" అని చెప్పాడు నారదమౌని.

"అదేం ప్రవాహం?" అడిగాడు దూర్వాసోముని.

"కాలప్రవాహం" అన్నాడు నారదమౌని.

"అంటే?" అడిగాడు దూర్వాసోముని.

"ప్రవాహం అనేటువంటి కాలం" అన్నాడు నారదమౌని.

దూర్వాసోమునికి కోపంవొచ్చింది. తన్ను తాను మరచి

పోయే కోపం వొచ్చినప్పుడే సత్యం మాట్లాడేది దూర్వాసో ముని.

"కాలం అనేటువంటి ప్రవాహం కాదూ?" అని అడిగాడు దూర్వాసోముని.

"అవునవును," అన్నాడు నారదమౌని. నారదమౌనికి నవ్వొచ్చింది.

దూర్వాసోముని ముక్కుకు సూటిగా మాట్లాట్టంవల్ల లాభం లేదని తెలుసుకున్నవాడై "సరే" అన్నాడు.

నారదమౌనికి, దూర్వాసోమునినిచూస్తే జాలి వేసింది. నవ్వువొస్తేగాని, నారదమౌనికి సత్యంరాదు. అందుకని నవ్వు తెచ్చుకొని దానిమహత్యం ఇలా చెప్పాడు — "కాల ప్రవాహంలోస్నానంచేస్తేచిరంజీవత్వంసిద్ధిస్తుంది" దూర్వాసో మునికి ఆశ పుట్టింది. ఆయనకు చిరంజీవత్వం వుందని మనం అనుకుంటాం గాని నిజంగా లేదు. అందుకనే ఆయనకు కోపం ఎక్కువ.

నారదమౌని మాటలు చెవినిపడ్డవో లేదో, దూర్వాసో ముని బర్రున భూలోకానికి దిగాడు.

నారదమౌని వెనకనుంచి బిగ్గరగా అరిచి చెప్పాడు.

"ముందు భూతకాలంలో, తర్వాతవర్తమానకాలంలో, ఆ తర్వాత భవిష్యత్ కాలంలో స్నానంచేస్తేనే చిరంజీవత్వం సిద్ధించేది! వరసక్రమం తప్పకూడదు"

"అదెంతపని!" అనుకున్నాడు దూర్వాసోముని.

## ౨

దూర్వాసోముని సరాసరి కాలప్రవాహం వొడ్డున దిగాడు. నారదమౌని మాటలు ఇంకా చెవుల్లో గింగురు మంటున్నై. ముందు భూతకాలంలో స్నానం చెయ్యాలి. తర్వాత వర్తమానంలో - అటుతర్వాత భవిష్యత్తులో - అప్పుడుగాని చిరంజీవత్వం సిద్ధించదు. నారదమౌని చెప్పి నప్పుడు, తేలిగ్గా బుటుకుబుటుకున మునిగి మొక్కు తీర్చు కుందాం అనుకున్నాడు గాని, తీరా కాలప్రవాహం దగ్గరకు వొచ్చేటప్పటికి చిక్కున పడ్డాడు. అంతా ఒకటే ప్రవాహం. అతి వేగంగా ప్రవహిస్తూవుంది. ఇది వర్తమానం అనుకుంటూ వుండగానే భూతకాలం కిందకు మారుతూవుంది. ఇది భవి ష్యత్తు అని తేల్చుకోకముందే భవిష్యత్తు వర్తమానం అవుతూ వుంది.

ఇక భూత వర్తమాన భవిష్యత్ కాలాలను ఎలా తెలుసుకోవటం? వరసక్రమంగా ఎలా స్నానంచెయ్యటం? దూర్వాసోముని ఏమీతోచనివాడై, కాలప్రవాహాన్నే అడిగి తెలుసుకుందాం అనుకున్నాడు.

"ఓ కాలప్రవాహమా?" అని పిలిచాడు.

"హాఁ!" అని హూంకరించింది కాలప్రవాహం. అది ఓంకారనాదం అనుకున్నాడు దూర్వాసోముని. ఒక్కక్షణం కంగారు పడ్డాడు. కాని దూర్వాసోముని దురాశాపరుడు. తన కోర్కెను జయించలేకపోయాడు.

"ఓ కాలప్రవాహమా?" అన్నాడు దూర్వాసోముని.

"హాఁ!" అన్నది కాలప్రవాహం.

"నేను దూర్వాసోమునిని" అన్నాడు దూర్వాసోముని.

"చిత్తం" అన్నది కాలప్రివాహం.

"నేను భూత వర్తమాన భవిష్యత్ కాలాల్లో స్నానం చెయ్య దలిచాను" అన్నాడు దూర్వాసోముని.

"చిత్తం" అన్నది కాలప్రవాహం.

"నీలో భూతవర్తమాన భవిష్యత్ కాలాలు దాగున్నాయని నారదమహాని చెప్పగా విన్నాను. ఎక్కడెక్కడ ప్రన్నవో చెప్పు. వాటిలో వరసక్రమం తప్పకుండా నేను స్నానం చెయ్యాలి" అన్నాడు దూర్వాసోముని.

"ఆదిలో భూతకాలం, మధ్యనవర్తమానం, అంతంలో భవిష్యత్తు" అన్నది కాలప్రవాహం. ఈ విధంగా దూర్వాసో మునికి చెప్పినదై, తన పనిమీద తాను వుంది కాల ప్రవాహం.

దూర్వాసోముని సంతోషించాడు. తన పని ఇంత తేలిగ్గా అవుతుందనుకోలేదు. ఎంత తపస్సు ధారపొయ్య వలసి వొస్తుందో అనుకున్నాడు. వెంటనే కాలప్రవాహం మొదలు కనుక్కోటానికి బయల్దేరాడు. భగీరథ ప్రయత్నానికి పూనుకున్నాడు.

కాలప్రివాహం వొడ్డునపడి నడిచాడు. నడిచాడు. యుగయుగాలు నడిచాడు. ఎంత నడిచినా కాలప్రవాహం మొదలు కనిపించలేదు. కాలప్రివాహం ఆది మధ్యాంత రహిత మేమో కొంపతీసి: దూర్వాసోమునికి కోపం వొచ్చింది.

"ఓ కాలప్రివాహమా?" అన్నాడు కోపంగా.

శ్రీ వేమన గ్రంథాలయము
బుడత్సాచు (కృష్ణా జిల్లా)



"హాఁ!" అన్నది కాలప్రవాహం.

"ఎక్కడ భూతకాలం?" అడిగాడు దూర్వాసోముని.

"ఇక్కడే" అన్నది కాలప్రవాహం.

ఆధ్వని ఎక్కడనుంచి వొచ్చిందీ తెలియలేదు దూర్వాసోమునికి— దిక్కులు పరికించాడు.

"ఇక్కడే!" అన్నది కాలప్రవాహం. మళ్ళీ ఆధ్వని ఎక్కడనుంచి వొచ్చిందీ తెలియలేదు దూర్వాసోమునికి. అసలే కోపదారేమో, ఆయనకు వొళ్ళు మండిపోయింది. కమండలం చేత్తోపాటు పైకెత్తినవాడై... "నేనే దూర్వాసో మునినైతే, నేనే చిరంజీవత్వంకోసం ప్రయత్నిస్తున్న వాడనైతే. నేనే ఫలానావారి పుత్రుడనైతే..." అని శాపం మొదలు పెట్టాడు.

దూర్వాసోముని తపశ్శక్తి కాలప్రవాహానికి తెలుసు. పైగా అగస్త్యులవారు సముద్రాన్ని పుడిసిల్లో పుక్కిలిస్తూ వుంటే కళ్ళారా చూచివుందికూడా! భయంతో గడగడ వొణికిపోయింది.

"దూర్వాసోమునీ..." అని ప్రార్థించింది.

"చెప్పూ" అన్నాడు దూర్వాసోముని.

"చెప్తున్నాను" అన్నది కాలప్రవాహం.

"ఇక ఒకక్షణం ఆగటానికి వీల్లేదు" అన్నాడు దూర్వాసోముని.

"మీ ఎడమ చేతివైపు భూతకాలం! ఎదురుగా వర్తమానం! కుడిచేతివైపు భవిష్యత్తు" అన్నది కాలప్రవాహం.

దూర్వాసోముని సంతోషించినవాడై ఎడమ చేతివైపు

ముందు స్నానం చెయ్యటానికి నిశ్చయించుకున్నాడు. నడిచాడు. నడిచాడు. యుగ యుగాలు నడిచాడు. ఎంత నడిచినా కాలప్రవాహానికి ఎడమచేతివైపు అనేది ఎక్కడికక్కడికి వుంటూనేవుంది. దూర్వాసోమునికి ఉక్రోషం వొచ్చింది. కాలప్రవాహం తన్ను మోసంచేస్తూవుంది అని తలచినవాడై, ఈసారి కాలాన్నే అడిగి తేల్చుకుందాం అనుకున్నాడు.

"ఓ భూతకాలమా?" పిలిచాడు దూర్వాసోముని

భూతకాలం "ఆఁ" అనిపలికింది.

"ఎక్కడ?" అడిగాడు దూర్వాసోముని.

"ఇక్కడ" చెప్పింది భూతకాలం.

దూర్వాసోముని సంబరపడి అక్కడ స్నానం చెయ్యటానికి సిద్ధపడ్డాడు.

"ఆగు" అన్నది వర్తమానం.

"ఎవరు నువ్వు?" అడిగాడు దూర్వాసోముని.

"వర్తమానాన్ని" చెప్పింది వర్తమానం.

"ఎక్కడున్నావు?" అడిగాడు దూర్వాసోముని.

"భూతకాలంలో" చెప్పింది వర్తమానం.

దూర్వాసోముని తికమక పడినవాడై గుక్క తిప్పుకోకే—"భవిష్యత్తు ఎక్కడ?" అని అడిగాడు.

"నాలో" చెప్పింది వర్తమానం.

దూర్వాసోమునికి ఆశాభంగం కలగటంవల్ల, కోపం తీక్షణమైంది. ఇదంతా కాలప్రవాహం ఆడుతున్న ఆటే అనుకున్నాడు. దానికి ఎంత నిర్లక్ష్యం! దానికి తన ప్రభావం తెలియజెయ్యాలి. రోగం కుదర్చాలి.

"ఓహో, కాలప్రవాహమా?" అన్నాడు.

కాలప్రవాహం గజగజ వొణికింది. పలకటానికే భయపడింది. శివుడు విషంమింగి గరళకంఠుడవటం కాలప్రవాహం కళ్ళారా చూచింది.

"నీవు భూత వర్తమాన భవిష్యత్తు అనే మూడు ముక్కలక్రింద తెగిపోదువు గాక!" అనిశపించాడుదూర్వాసో ముని.

కాలప్రవాహం తుకతుక ఉడికింది. గుబగుబపొంగింది. దడదడ లాడింది. బరబర మూడు ముక్కలకింద విడిపోయింది. దూర్వాసోముని తన తపశ్శక్తికి తానే అచ్చెరువు పొందాడు. వికసించిన ముఖపద్మం గలవాడై, వరసక్రమంగా భూత వర్తమాన భవిష్యత్ కాలాల్లో స్నానం చెయ్యటానికి సిద్ధపడ్డాడు.

కాని ఆశ్చర్యం! ఆ మూడుముక్కలూ ఇప్పుడు ప్రవాహాల్లా లేవు. కరుడుకట్టుకుపోయినై. భయంకరమైన చీకట్లను విరజిమ్ముతున్నై! కాలప్రవాహం చీకటిమయంగా మారింది. ఆ చీకటిలో భూత వర్తమాన భవిష్యత్ కాలాలు ఎక్కడున్నవో దూర్వాసోమునికి తెలియలేదు. ఎలా వరసక్రమం తప్పకుండా స్నానం చెయ్యటం? ఎలా చిరంజీవత్వాన్ని పొందటం?దూర్వాసోమునికి వొళ్ళు తెలియని కోపంవచ్చింది. కమండలంతో చీకటిని ఛేదించి శపించాడు.

"భూతకాలమా, నీవు చెట్టుబెరడువు అవుదువుగాక!"

భూతకాలం చెట్టుబెరడై గట్టుమీదకు ఎగిరి దూకి, నుంచుంది.

"వర్తమానమా, నీవు చెట్టుబోదెవు అవుదువుగాక!" అన్నాడు దూర్వాసోముని.

వర్తమానం చెట్టుబోదె అయి గట్టుమీదకు వొచ్చి కూర్చుంది.

"భవిష్యత్తూ, నీవు చెట్టువిత్తువు అవుదువుగాక!" అన్నాడు దూర్వాసోముని. భవిష్యత్తు విత్తు అయి గట్టుమీదకు దొర్లిపడున్నది.

"ఇక ఇప్పుడేం చేస్తుంది కాలప్రవాహం? దూర్వాసోమునిని స్నానం చెయ్యకుండా ఆపగలదా!" అని సగర్వంగా అనుకొని, స్నానానికి సిద్ధపడ్డాడు దూర్వాసోముని.

ఆహా! ఏమి చెప్పను!! ఎక్కడ కాలం లేదు గదా, ప్రవాహంకూడా లేదు.

కాలప్రవాహం అదృశ్యం అవటంవల్ల ముల్లోకాలూ తల్లడిల్లినై. దేవతలకు ముచ్చెమటలు పోసినై. దానవులకు నాభిదగ్గరవున్న అమృతకలశాలు కదిలినై. మానవులకు కోరలు మొలిచినై. అంతా ఆదరా బాదరా దూర్వాసోమునిని చుట్టుముట్టారు. "మౌని చంద్రమా కాలప్రవాహం ఆగటంవల్ల ముల్లోకాలూ తల్లడిల్లుతున్నై. వర్ణించటానికి వీల్లేని వైపరీత్యాలు జరుగుతున్నై. తమరు శాపం ఉపసంహరించుకోండి" అని ప్రార్థించిన వారయ్యారు.

దూర్వాసోముని వికటమొహం వేసుకొని నుంచున్నాడు. తనశాపం ఇలా పరిణమిస్తుందని ఆయన అనుకోలేదు. కాలప్రవాహం ఆగిపోవటంవల్ల ఆయనదృష్టి మందగించింది. శరీరం భుగభుగ మండిపోతూవుంది. మాట్లాడ్డా

నికే ప్రబల ప్రయత్నం చెయ్యవలసి వొచ్చింది. "నేనేం చెయ్యను? నాకు శాపం ఇచ్చే శక్తేగాని, ఉపసంహరించు కునే శక్తిలేదు," అన్నాడు.

ఈ మాటకు దేవతలకు దానవులకు మానవులకు మానులకు అందరికీ కోపంవొచ్చింది.

"పోనీ శాపవిమోచనానికి మార్గంచూపు స్వామీ" అన్నాడు నారదమాని.

దూర్వాసోముని ఉఛ్వాసనిశ్వాసాలు బిగబట్టినవాడై ఇలా అన్నాడు — "ఎవరైతే భూతకాలం అనే బెరడుతో పళ్లుతోముకొని, వర్తమానం అనే బోదెతో మొహం కడు క్కొని భవిష్యత్తు అనే విత్తుని భోజనంచేస్తారో వారివల్ల నా శాపవిమోచనం అవుతుంది."

దేవతలు ప్రయత్నించారు. దానవులు ప్రయత్నించారు. మానవులు ప్రయత్నించారు. మానులు ప్రయత్నించారు. కాని ఎవ్వరివల్లా ఈపని కాలేదు. భూతకాలం అనే బెరడుగానీ, భవిష్యత్తు అనే విత్తుగానీ వాళ్ళకు అందలేదు. దొరికినట్టే దొరికి దూరంగావెళ్లి నిలబడేవి.

"మానిచంద్రిమా, మావల్లకాలేదు," అని ప్రాధేయ పడ్డారు అంతా.

నారదమాని మాత్రం చిరునవ్వు నవ్వుతూ నుంచు న్నాడు.

"మీావల్ల కాదు. కలియుగంలో ఒకమహాపురుషుడు జన్మిస్తాడు. అతనే నా శాపవిమోచనం చెయ్యటానికి సమ ర్థుడు," అన్నాడు దూర్వాసోముని.

"కలియుగంలోనా?" అన్నాడు విశ్వామిత్రుడు.

"అవును" అన్నాడు నారదమౌని చిరునవ్వు నవ్వుతూ.

"వశిష్టమహర్షీ?" పిలిచాడు విశ్వామిత్రుడు.

"ఏం, విశ్వామిత్ర రాజర్షీ?" పలికాడు వశిష్టబ్రహ్మర్షి.

"కలియుగంలో ధర్మం ఎన్ని కాళ్ళమీద నడుస్తుంది?" అడిగాడు విశ్వామిత్రరాజర్షి.

"ఒంటికాలిమీద" అన్నాడు వశిష్ట బ్రహ్మర్షి.

"మనవల్లకానిపని వాళ్ళెలా చేస్తారు?" అడిగాడు విశ్వామిత్రరాజర్షి.

"నేను నమ్మను?" అన్నాడు వశిష్టబ్రహ్మర్షి.

"నమ్మక చేసేదేమిటి?" అడిగాడు నారదమౌని చిరునవ్వు నవ్వుతూ.

అంతా ఆలోచించారు— "నిజమే" అన్నారు.

"అయితే కలియుగం వొచ్చేవరకూ మనం అంతా ఎలా బ్రతకటం?" అన్నాడు వశిష్టబ్రహ్మర్షి.

"మనం చిరంజీవులం బ్రహ్మర్షీ!" అన్నాడు విశ్వామిత్ర రాజర్షి.

"అయితే మాత్రం?" అన్నాడు వశిష్టబ్రహ్మర్షి.

"పొగన్నా తాగొద్దూ?" అన్నారు మౌనులు.

"సత్యం సత్యం" అన్నాడు నారదమౌని చిరునవ్వు నవ్వుతూ.

"కలియుగం వొచ్చేవరకూ, కాలప్రవాహం కదిలే వరకూ, మేము ఆకూ అలంగా వుంటాం" అన్నారు దేవతలు.

"కొండా గుట్టలుగా వుంటాం" అన్నారు దానవులు.

"కాయ గసరులుగా వుంటాం" అన్నారు మానవులు.

"తథాస్తు" అన్నాడు నాదరమాని చిరునవ్వు నవ్వుతూ.

అకస్మాత్తుగా దేవతలూ దానవులూ మానవులూ మానులూ అంతా అంతర్థానం అయ్యారు. భారతదేశం కీకారణ్యం అయింది.

3

కలియుగం వొచ్చింది. దూర్వాసోముని చెప్పినట్లు ఒక మహాపురుషుడు పుట్టాడు. పుట్టీ పుట్టటంతోనే కీకారణ్యాగా వున్న భారతదేశం తిరగటం మొదలు పెట్టాడు.

అతన్నిచూచి భూత వర్తమాన భవిష్యత్ కాలాలు ఆనందంలో ఉప్పొంగిపోయినై. గంతులువేస్తూ, "అడుగో మహాపురుషుడు" అన్నది భూతకాలం అనే బెరడు.

ఉబ్బిపోతూ, "ఆహా!" అన్నది వర్తమానం అనే బోదె.

దొర్లుతూ, "వొచ్చాడు నాస్వామి" అన్నది భవిష్యత్తు అనే విత్తు.

ఆ మహాపురుషుడు ఇదంతా గమనించ లేదు. ఒకఆవులింత ఆవులించి సరిగ్గా లెక్కపెట్టినట్టు మూడుచిటికెలు వేశాడు. మూడుచిటికెలూ, ఇంతంతై, బ్రహ్మాంతై మూడు కాలాల్నీ నిలవేసినై. మొదటి చిటికె భూతకాలాన్ని, రెండో చిటికె వర్తమానాన్ని, మూడోచిటికె భవిష్యత్తుని. అతను నెమ్మదిగా కదిలాడు. భూతకాలం అనే బెరడుతో పళ్లు తోముకున్నాడు. వెంటనే భూతకాలం వర్తమానంతో కలిసింది. వర్తమానం అనే బోదెతో మొహం కడుక్కున్నాడు. వెంటనే

వర్తమానం భవిష్యత్తులో కలిసింది. భవిష్యత్తు అనే విత్తుని తీరిగ్గాకూచోని భోజనం చేశాడు.

వెంటనే కాలప్రవాహం వాయువేగ మనోవేగాలతో ప్రవహించటం మొదలుపెట్టింది. భారతదేశం అనే కీకారణ్యానికి చలనం కలిగింది. ఆకూ అలం దేవతలైనై. కొండా గుట్టలు దానవులైనై. కాయగసరులు మానవులైనై. దుంప కూరలు వానరులైనై. అయ్యా అవటంతోనే దేవతలు దానవులు మానవులు వానరులు అంతా మహాపురుషుణ్ణి చూట్టానికి పోగయ్యారు. చూచి ఆశాభంగం చెందినవారై, ఒకరి మొహాలు ఒకరు చూచుకున్న వారయ్యారు.

"ఎవరు ఇది?" అడిగాడు విశ్వామిత్ర రాజర్షి.

"ఎవరిది?" అన్నాడు వశిష్ట బ్రహ్మర్షి.

"ఎవరు ఇది?" "ఎవరిది?" "ఎవరు ఇది?" "ఎవరిది?" అన్నారు అంతా.

అతనికి దేవతలకు మల్లే రెక్కలున్నై. దానవులకు మల్లే కోరలున్నై. మానవులకు మల్లే చూపులున్నై. వానరులకు మల్లే గడ్డం వుంది. ఎవరికి వారికి అతన్ని ఎక్కడో చూచినట్టు వుంది. కాని అతన్నెవరూ చూడక పోవటం యదార్థం. ఎవరికివాళ్లు తను లక్షణం చూచుకొని ఎక్కడో చూశాం అనుకున్నారే గాని, అందరి లక్షణాలూ కలిసివున్న వ్యక్తిని ఇదే వారు మొదటిసారి చూట్టం.

"ఎవరు ఇది?" అడిగాడు విశ్వామిత్ర రాజర్షి.

"ఎవరిది?" అన్నాడు వశిష్ఠ బ్రహ్మర్షి.

"పశుబలం" అన్నారు దేవతలు.

"ఇంద్రజాలం" అన్నారు దానవులు.

"వర్గకలహం" అన్నారు మానవులు.

"రంభయో, తిలోత్తమయో, ఊర్వశియో" అన్నారు మానులు.

అంటం అయితే అన్నారేగాని, నిజం చెప్పాలంటే అతనెవ్వరో ఎవ్వరికీ తెలియదు. ఇంతలో విశ్వమంతా ఒక్కసారి ఓంకారనాదం చేసింది. ఆ నాదబ్రహ్మంలోనుంచి వేదాలూ ఉపనిషత్తులూ పైకొచ్చి భూమిమీదకు దిగినై. దేవతలూ, దానవులూ, మానవులూ, మానులూ——అందరూ సగౌరవంగా నమస్కరించి, దూరంగా నిలబడ్డారు.

విశ్వామిత్రరాజర్షి ఒకఅడుగు ముందుకు వేసినవాడై "ఎవరు ఇది?" అని అడిగాడు మహాపురుషుణ్ణి చూపి.

వశిష్ఠబ్రహ్మర్షి రెండు అడుగులు ముందుకు వేసినవాడై "ఎవరిది?" అన్నాడు.

వేదాలు అపౌరుషేయాలు అవటంవల్ల, మాట్లాడకుండా మునగదీసుకు కూర్చున్నయి. ఉపనిషత్తులు దివ్యదృష్టితో ఆ మహాపురుషుణ్ణి పరిశీలించి చూస్తున్నయి. ఉపనిషత్తులకు తెలియం దేముంటుందిగనక! అంతా వాటి వాగామృతం గ్రోలాలని నిరీక్షిస్తున్నారు.

పరీక్ష పూర్తి అయింది.

ఉపనిషత్తులు కంఠంపైకెత్తి, తమ దివ్యదృష్టితో దేవతలను దానవులను మానవులను మానులను పరిశీలిస్తూ అడిగాయి——"ఎవరిది?"

అంతా ఆశ్చర్యపడ్డారు. భయపడ్డారు. ఉపనిషత్తులకే

తెలియలేదు. వేదాలనడిగి ప్రయోజనంలేదు. అవి అపౌరుషేయాలు అవటంవల్ల మాట్లాడవు. ఇక ఒకరే మిగిలారు త్రిలోకసంచారియైన నారదమౌని. విశ్వామిత్ర రాజర్షి వశిష్ఠ బ్రహ్మర్షి తమలోతాము గుసగుస లాడుకొన్నవారై ఆయన్ని పట్టుకొనివచ్చి మధ్య నిలబెట్టినవారయ్యారు. "ఎవరు ఇది?" అడిగాడు విశ్వామిత్రరాజర్షి.

"ఎవరు ఇది?" అన్నాడు వశిష్ఠ బ్రహ్మర్షి.

"బుడతకీచు" అని చెప్పాడు నారదమౌని చిరునవ్వు నవ్వుతూ.

ఈ మాటలకు అంతా నిర్ఘాంతపడ్డారు.

"బుడతకీచా!" అన్నాడు విశ్వామిత్ర రాజర్షి గుక్కలు పట్టి నవ్వుతూ.

"మడతపేచీ!" అన్నాడు వశిష్ఠ బ్రహ్మర్షి పకపలు విరగ ఏడుస్తూ.

"ఎవరునువ్వు?" బుడతకీచుని అడిగారు దేవతలు.

ఈ ప్రశ్నకు అతని రెక్కలు వూడినై.

"ఎవరునువ్వు?" అడిగారు దానవులు.

ఈ పశ్నకు ఆతని చూపులు మారినై.

"ఎవరు నువ్వు?" అడిగారు మానులు.

ఈ ప్రశ్నకు అతని గడ్డం కరిగింది.

ఇదంతా చూస్తూంటే కాల ప్రవాహానికి భయం వేసింది. ఈ దేవతలూ దానవులూ మానవులూ మానులూ అంతా కలిసి తన బుడతకీచుని ఏంచేస్తారో అని. ఈభయంతో వొణుకుతున్న తన చేతులను జాపినదై నెమ్మదిగా తన

అంకంలోకి తీసుకుంది బుడతకీచుని. బుడతకీచు కాలప్రవాహంలో తేలిపోయాడు. కాలప్రవాహం వాయువేగ మనోవేగాలతో ప్రవహిస్తూ వుంది. దేవతలూ, దానవులూ, మానవులూ, మానులూ దిగబడి పోయారు. ఏ ఒక్కరూ కాల ప్రవాహంలో కలవలేదు. అందుకనే భారతదేశంలో దేవతలు దేవతలుగానే వుండిపోయారు. దానవులు దానవులుగానే వుండిపోయారు. మానవులు మానవులుగానే వుండిపోయారు. మానులు మానులుగానే వుండిపోయారు. దూర్వాసోముని కాలప్రవాహాన్ని ఆపినదానికి ప్రతిఫలం అనుభవిస్తున్నాం.

# దారిద్ర్యం

మా ఇంటికి ఆనుకుని ఒక పెంకుటిల్లు వుంది. అది చాలా చిన్న ఇల్లు. దానికి తగినట్టు ఆ ఇంటి కామందు ముందు రెండుగదులలా పదిరూపాయలకు మరొక కుటుంబానికి అద్దెకు ఇచ్చాడు.

అద్దెకు వున్న ఆయనకు నెలకు ఏభై రూపాయిల జీతం. ఎక్కడో, ఏమి ఉద్యోగమో నాకు తెలియదుగాని పొద్దున్నే ఎనిమిది గంటలన్నా అవకముందే భోజనంచేసి వెడుతూ వుంటాడు. మళ్ళీ చీకటిపడ్డాక తిరిగివొస్తాడు.

వొస్తాడంటే అతను రావటం నేనెన్నడూ చూడలేదు. కాని అతను వొచ్చిన మరుక్షణమే నాకు తెలిసేది - అతను వొచ్చాడని.

ఇంచుమించు అతను రోజూ ఆఫీసునుంచి తిరిగిరాగానే భార్యను కొడుతూ వుండేవాడు. ఆమె గోలగా ఏడుస్తూ వుండేది. అప్పుడు నాకు తెలిసేది, అతను వొచ్చాడని.

అతనికి ముగ్గురు పిల్లలు-ఇద్దరు మొగపిల్లలు ఒక ఆడ పిల్ల. మొగపిల్లలిద్దరూ చిన్నవాళ్ళు. ఆడపిల్ల పెద్దది. రజస్వలై నాలుగు సంవత్సరాలయింది. ఇంకా వివాహంకాలేదు.

భర్త ఇంటికిరాగానే "దానికి పెళ్ళి చేస్తావా, చెయ్యవా?" అని అడిగేది భార్య.

"ఎట్లా చెయ్యమంటావు?" అనేవాడు భర్త.

"అందరూ చేసినట్టే" అనేది భార్య.

"చేతిలో దమ్మిడీలేదు" అనేవాడు భర్త.

"దానికి నన్నేం చెయ్యమంటావు?" అనేది భార్య.

"డబ్బులేదంటూ వుంటే" అనేవాడు భర్త.

"పెళ్ళి చెయ్యమంటూ వుంటే" అనేది భార్య.

"అయితే చేస్తానుండు" కర్రతీసుకుని కొట్టేవాడామెను భర్త.

ఆమె గోలగా ఏడ్చేది.

ఈ విషయాలన్నీ నాకు తెలిసినై. అకస్మాత్తుగా పెళ్లి కాని పిల్లమీద నాకు జాలి వేసేది...

వాళ్లువున్న ఇంటికెదురుగా ఒక మేడవుంది. ఆ మేడ ఇన్‌కంటాక్సు ఆఫీసరుది. అతనికి నెలకి వెయ్యిరూపాయిలు జీతం. నలుగురు బంట్రోతులు, ఒక కారు, ఒక భార్య, ఒక పిల్లవాడు, తనూ అంతా అట్టహాసంగా వుండేది. వాళ్లది చాలా మంచి పొరుగు. వాళ్ల పనేదో వాళ్లది తప్ప ఏజోక్యం పట్టించుకోరు.

ఇన్‌కంటాక్సు ఆఫీసరు సాయంకాలం అయిదు గంటలకు ఆఫీసునుంచి ఇంటికి వొచ్చేవాడు. ఆయన వొచ్చేటప్పటికి భార్య ముస్తాబై సిద్ధంగా వుండేది. పిల్లవాణ్ణి తీసుకుని ఇద్దరూ షికారు వెళ్ళేవారు.

ఆ పిల్లవాణ్ణి చూస్తే నాకు ముచ్చట. ఒకరోజు చిన్న కారు తొక్కుతూ, ఒక రోజు మూడుచక్రాల సైకిలు తొక్కుతూ రోడ్డుమీద అటూఇటూ తిరుగుతూ వుండేవాడు. బత్తాయిలూ, దానిమ్మలూ, ఐస్‌ఫ్రూట్లూ, చివరకి పీచుమిఠాయీ—ఎవరినీ ఆ దారిన పోనిచ్చేవాడు కాదు.

ఆ పిల్లవాణ్ణి చూస్తే తల్లిదండ్రులకి అమితగారాబం. ఎక్కడికి వెళ్ళినా వెంట తీసుకు వెళ్ళేవారు. మంచి మంచి దుస్తులు వేసి పరిశుభ్రంగా వుంచేవారు. అడిగినప్పుడల్లా డబ్బిచ్చేవారు. ఎప్పుడూ తిట్టినట్టుగాని, కొట్టినట్టుగాని నే నెరగను.

ఈ పిల్లవాడివల్ల వచ్చింది తగాదా.

ఒకరోజు నేను మా ఇంట్లో నుంచి బయటికి వచ్చే టప్పటికి ఇన్‌కంటాక్సు ఆఫీసరు భార్య వాళ్ల మేడ బాల్కనీ లో నుంచునివుంది. మా ఇంటి పక్క ఆవిడ తన ముగ్గురు బిడ్డలని పెట్టుకుని తన వాకిట్లో నుంచుని వుంది. ఇద్దరూ పోట్లాడు కుంటున్నారు.

"ఆ మాత్రం బుద్ధి వుండనక్కర లేదుటే?" అని అడిగింది మా ఇంటి పక్కావిడ.

"ఏ మాత్రం?" అడిగింది ఆఫీసరు భార్య.

ఏ మాత్రమో చెప్పింది ఇంటి పక్కావిడ.

"ఇంట్లోదూరి కూర వండుకునే చట్టి ఎట్లా బద్దలు కొట్టాడో చూడు నీ కొడుకు" అన్నది.

"ఏం బాబూ?" అని అడిగింది ఆఫీసరు భార్య కొడుకుని.

"లేదమ్మా, నేనివాళ వాళ్ళ యింటికే వెళ్ళలేదు" అన్నాడు కొడుకు.

"వింటున్నావా?" అని అడిగింది ఆఫీసరు భార్య.

"కొడుకుని వెనకేసు కొస్తున్నావా?" అని తిట్టింది మా ఇంటి పక్కావిడ. "ఇప్పుడు చట్టిని మళ్ళీ కొనాలి

శ్రీ వేమన గ్రంథాలయము
దారి ... (కృష్ణా జిల్లా.)



అంటే అణాపెట్టాలి."

"అణా తీసుకు పూరుకో" అన్నది ఆఫీసరు భార్య.

"నీ కెంత పొగరే?" అన్నది మా ఇంటి పక్కావిడ.

"మొగుడు సంపాదిస్తున్నాడని మదం" అన్నది పెళ్ళి కాని పిల్ల.

ఈ పిల్లని చూస్తేనేనట నాకు జాలి !

"ఉంటే తింటుంది, ఎవరికేం?" అన్నది మా ఇంటి పక్కావిడ.

ఈ విధంగా తల్లీ, కూతురూ తిట్టుమీద తిట్టు ప్రారంభించారు. ఆఫీసరుభార్య వాళ్ళతిట్లు భరించలేక బిక్కమొహం పెట్టుకుంది. "అయితే ఇప్పుడేం చెయ్యమంటారు?" అని అడిగింది.

"నీ కొడుక్కి బుద్ధిచెప్పుకో" అన్నది మా ఇంటి పక్కావిడ.

"నన్ను కారుఎక్కించమంటే ఎక్కించలేదే!" అన్నాడు మా ఇంటి పక్కావిడ పిల్లవాడు.

"వాణ్ణి తన్ని మా వాకిట్లోకి రాకుండా చేస్తావా, లేదా?" అని అడిగింది మా ఇంటి పక్కావిడ.

"తన్నటం నా వల్లకాదు" అన్నది ఆఫీసరుభార్య.

"మరి ఏం చేస్తానంటావ్ ?" అన్నది మా ఇంటి పక్కావిడ.

"మీ ఇంటికి రాకుండా చేస్తాను" అని పిల్లవాణ్ణి తీసుకుని గిరుక్కున లోపలికి వెళ్ళింది ఆఫీసరుభార్య.

"మా వాకిటి ముందుకి వచ్చాడంటే మక్కెలు విరగ

కొడతాను. మా పిల్లవాళ్ళతో మాట్లాడితే డొక్క చీలు స్తాను'' అన్నది మా ఇంటి పక్కావిడ.

"బజారులోవున్న పిల్లలందర్నీ చెడగొడుతున్నాడే?'' అన్నది పెళ్ళికాని పిల్ల.

"ఇందాకా పీచుమిఠాయి పెట్టమంటే పెట్టలేదే!" అన్నాడు పిల్లవాడు.

"మహాతల్లి పెట్టనిస్తుందా?" అన్నది మా ఇంటి పక్కావిడ.

"మొగుడు సంపాదిస్తున్నాడని మదం" అన్నది పెళ్ళి కాని పిల్ల.

ఈ పిల్లను చూస్తేనేనట నాకు జాలి!

ఈ పోట్లాట వింటూవుంటే నాకు ఆశ్చర్యం వేసింది. మా ఇంటి పక్కావిడ గిల్లి కజ్జా పెట్టుకోవాలని ప్రయత్నిస్తూ వుందని నాకు అనుమానం. కాని ఎంత ఆలోచించినా, కారణం మాత్రం బోధపడలేదు.

కొంచెంసేపయిం తరవాత ఏమీతోచక బజారుకి బయలుదేరాను. ఆఫీసరుగారి యిల్లు లోపలగడియవేసివుంది. మా ఇంటిపక్కావిడమాత్రం తన ముగ్గురు పిల్లలతోటీ వాకిట్లోనేవుంది. వాడకట్టు అమ్మలక్కలంతా ఆమెచుట్టూ పోగయ్యారు.

"బాగా రోగం కుదిర్చావే" అంటున్న దొకావిడ.

"లేకపోతే, హద్దూ పద్దూ వుండక్కర్లా? జేబులో డబ్బులు వేసుకురావటం, కనపడ్డవల్లా కొనటం. వాణ్ణిచూచి ఎన్నడూలేని మా పిల్లలుకూడా నేర్చుకున్నారు; ఊపిరాడ

నిస్తున్నారా ?" అన్నది మా ఇంటిపక్కావిడ.

"వాడు తొడుక్కున్న సిల్కుచొక్కాలాంటిది కుట్టించమని నాలుగు రోజులనుంచి వేధిస్తున్నాడు మా వాడు" అన్నది ఇంకొకావిడ.

"సరే, అల్లాంటి కారుకోసం మావాడు ఒకటేగోల" అన్నది మరొకావిడ.

"డబ్బున్నదని పిల్లలకట్లా ఇచ్చుకుంటారటే ఎక్కడైనా? వేలెడున్నాడో లేడోగాని వాడికప్పుడే ఎన్నిషోకులో చూశావా? ఇట్లా అయితే మనమెక్కడ కాపరాలు చెయ్యగలం?" అన్నది మా ఇంటిపక్కావిడ.

"నువ్వివాళ బాగా వొడ్డించావులే" అన్నది ఒకావిడ.

"అప్పుడే అయిందీ. వాళ్ళ నీ వీధిలో లేకుండా చేస్తేనే గాని నాకు నిద్రపట్టదు" అన్నది మా ఇంటిపక్కావిడ.

"అంతే, అంతే" అన్నారు అమ్మలక్కలంతా.

"లేకపోతే, తన కొడుకు సంగతేగాని మిగతా వాళ్ళ సంగతి ఆలోచించక్కర్లా?" అన్నది మా ఇంటిపక్కావిడ.

"మొగుడు సంపాదిస్తున్నాడని మదం" అన్నది పెళ్ళి కాని పిల్ల.

ఈపిల్లని చూస్తేనేనట నాకు జాలి!

రాత్రి అయింది. మా ఇంటిపక్కావిడభర్త యింటికి వొచ్చాడు. వొచ్చీరావటంతోటే "దానికి పెళ్ళిచేస్తావా, చెయ్యవా?" అని అడిగింది భార్య.

"ఎట్లా చెయ్యమంటావ్?" అన్నాడు భర్త.

"అందరూ చేసినట్టే" అన్నది భార్య.

"చేతిలో దమ్మిడీలేదు," అన్నాడు భర్త.

"దానికి నన్నేం చెయ్యమంటావ్?" అన్నది భార్య.

"డబ్బులేదంటూవుంటే" అన్నాడు భర్త.

"పెళ్ళిచెయ్యమంటూవుంటే" అన్నది భార్య.

"అయితే చేస్తానుండు" అని కర్రతీసుకుని కొట్టాడా మెను భర్త.

ఆమె గోలగా ఏడ్చింది.

# ఎందుకు?

"జ్ఞానానికి పరిపూర్ణత్వం లేదని మీరంటారు?"

"లేదు జ్ఞానం, ఎప్పటి కప్పుడు పరిస్థితుల్నిబట్టి లిమిట్ అవుతూ వుంటుంది."

"అయితే ఇప్పుడు మనకున్న జ్ఞానాన్నిబట్టి నిజం అనుకున్న విష యాలు, రేపు, 'కావు' అని తేలవచ్చు?"

"ఆహా, సందేహంఎందుకు?"

"అయితే ఎందుకండి ఈశ్రమ? ఇప్పుడు ఇది నిజం అనుకుని, అహోరాత్రుళ్ళూ కష్టపడటం ఎందుకు? రేపు మళ్ళీ కాదనుకొని, తేల గుడ్లు వెయ్యటం ఎందుకు?" "అదే పొరపాటు. ఇవాళ మనకున్న జ్ఞానం, రేపు తప్పు అని తేలుతుందనుకోవటంకంటే, సంపూర్ణం కాదని తెలుస్తుం దనుకోవటం నిజం. ఇప్పుడున్న జ్ఞానాన్ని నమ్మి పనిచెయ్యబట్టి, ఈజ్ఞానం అసంపూర్ణం అనే జ్ఞానాన్ని పొందగలుగుతున్నాం. అసంపూర్ణంగావున్న జ్ఞానాన్ని ఎప్పటికప్పుడు నింపుకోవటమే అభివృద్ధి. జ్ఞానం అసంపూర్ణం గదా దానిజోలి మనకెందుకనుకుంటే, జ్ఞానమూలేదు; అభివృద్ధీలేదు."

# ఆత్మగతం

లీల మేడకిటికీ దగ్గరకు వచ్చి ఆకాశంకేసి చూచే సరికి మబ్బులు కమ్ముతున్నై. అకస్మాత్తుగా ఆమెకు పుట్టింటికి వెళ్లాలనిపించింది.

లీలకి వివాహమై రెండుసంవత్సరాలయింది. ఈరెండు సంవత్సరాలనుంచీ, ఎన్నడూ ఆమె కిటువంటి ఆలోచన కలగ లేదు. ఇంచుమించు ఆమె తల్లిదండ్రులని మరిచిపోయిందనే చెప్పాలి.

"పోనీ, ఒకసారి వెళ్లిరాంరాదూ?" అనేవాడు ఆమె భర్త మోహన్.

"వాళ్లు రమ్మనందే?" అనేది లీల.

లీలపుట్టింటివారు తమని రమ్మనరని మోహన్‌కి తెలుసు. లీల తనని వివాహం చేసుకోటం వారి కెవరికీ ఇష్టంలేదు లీల సౌందర్యాన్ని గురించీ, తెలివితేటలనిగురించీ, జాతకాన్ని గురించీ వారికి గొప్పఅభిప్రాయంవుండేది. మోహన్ లీలకి తగిన వరుడు కాదని వారి అందరి అభిప్రాయమూను. వారు లీలకి అనేకవిధాల బోధించిచూశారు. మోహన్‌లో వున్న లోపాలు గోరంతలు కొండంతలు చేసి చెప్పారు.

"అతనికి సంపాదనమీద దృష్టిలేదు" అన్నారు.

అప్పుడు ఇదొక లోపంగా కనపడలేదు లీలకి. "సంపా దనమీద దృష్టి సామాన్యమానవులకి వుంటుంది మోహన్ అసాధారణవ్యక్తి" అనుకొన్నది.

"అతనిది నిలకడలేని మనసు" అన్నారు.

అప్పటిదాక లోపంగా కనపడలేదు లీలకి. "మోహన్ కళోపాసకుడు; నిత్యనూతనుడు; ఎప్పటికప్పుడు నూతన అనుభవాలను జీర్ణించుకొని పరిపూర్ణత్వసిద్ధికోసం ప్రయత్నించే మేధాసంపన్నుడు" అనుకొన్నది.

వారింకా అనేకం చెప్పారు. వారు మోహన్‌నిలా అపార్థం చేసుకోటానికి అతని సౌందర్యపిపాసే కారణం అనుకొన్నది లీల. వారి అమాయికత్వానికి నవ్వుకొన్నది. "మోహన్-తన మోహన్-ఈ సాధారణ మానవులకి అర్థం అవుతాడా?" అని ముగిసింది.

చివరికి, పుట్టింటివారి కెవరికీ యిష్టం లేకపోయినా మోహన్‌ని వివాహం చేసుకుంది. తల్లిదండ్రులుగాని, అన్నగాని, చెల్లెలుగాని, ఎవరూ తన వివాహానికి రాలేదు. మహదానందంలో తేలిపోతున్న లీలకి, తనవారెవరూ రాలేదని అనిపించలేదు. ఊళ్ళోవున్న కవులూ, రచయితలూ, కళాజీవులూ, అంతావచ్చి నూతన వధూవరులను ఆశీర్వదించారు. నిత్యనూతనత్వంకోసం తపించిపోయే మోహన్‌కి దివ్యజ్యోతి దొరికిందని అభినందించారు. వారి ప్రశంసలకి లీల పరవశత్వం పొందింది. ఇంత ఉత్తమ పురుషునికి భార్య అయినందుకు గర్వించింది. తన జీవితం మోహన్ ఆదర్శసాధనకు సహాయం చెయ్యటానికై అంకితం చెయ్యాలని నిశ్చయించుకుంది.

వివాహంకాగానే లీలామోహనులు వినోదంగా కాలక్షేపం చెయ్యాలనే ఉద్దేశంతో పుణ్యక్షేత్రాలూ, ప్రముఖ

స్థానాలూ, రమణీయదృశ్యాలూ చూచిరావటానికి బయలు దేరారు. శ్రీరంగం, కంచి, మధుర, అజంతా, హంపీ, ఎల్లోరా మొదలైన ప్రదేశాలను దర్శించారు. హంపీ, అజంతా దృశ్యాలను చూచినప్పుడు లీలహృదయం నీరయింది. వాటి పూర్వచరిత్రనీ, ప్రస్తుత స్థితినీ మోహన్ ఆమెకు కళ్ళకి కట్టి నట్టు వర్ణించి చెప్పాడు. హంపీక్షేత్రంలోని శిల్ప చాతు ర్యాన్నీ, అజంతా గుహాలలోని చిత్రనైపుణ్యాన్నీ వివరిం చాడు.

"చూశావా మన పూర్వపు ఔన్నత్యం!" అన్నాడు.

ఆమెహృదయం ఉప్పొంగింది.

"చూడు, ఈనాటి దీనావస్థ" అన్నాడు.

ఆమెహృదయం క్రుంగింది.

ఇంత వైభవాన్ని, ఇంతసౌందర్యాన్ని పోషించలేని, ఆనందించలేని జాతిమీద కోపంవచ్చింది. మోహన్‌వంటి రసహృదయులు, కళారాధకులు పదిమందివుంటే దేశం ఇంత దౌర్భాగ్యస్థితికి వచ్చేది కాదుగదా అని చింతించింది. ఆక్షణం ఆమెకళ్లకి మోహన్ దివ్యమూర్తిగా కనిపించాడు. మూర్తీ భవించిన ప్రకృతిలాలిత్యంగా కనిపించాడు.

"నా మోహన్, నా మోహన్" అనుకుంది; తన్మయ త్వం చెందింది. మోహన్ చేత అనేక ఘనకార్యాలు చేయిం చాలని మనస్సులో నిశ్చయించుకుంది.

దంపతులిద్దరూ ఇంటికి తిరిగి వచ్చారు...

మోహన్ చిత్రకారుడు. పిత్రార్జితం తక్కువ. అందు వల్ల ఆర్థికంగా తరచు అనేక బాధలుపడుతూ వుండేవాడు.

ఈసంగతి లీలకి తెలుసు. వివాహానికి ముందే తన కుటుంబ పరిస్థితులూ, ఆర్థికమైన చిక్కులూ అన్నీ ఆమెకు చెప్పాడు. ఆమె అతని నిష్కపట స్వభావానికి సంతోషించింది.

"ఎంత అలౌక్యులు" అన్నది మురిపెంగా.

"ఏమిటి?" అని మోహన్ ఆపుర్దాగా అడిగాడు.

"వివాహం చేసుకునే స్త్రీకి ఇలాంటి సత్యాలు తెలియనిస్తారా?" అన్నది.

"మరి నీ యిష్టం" అన్నాడు మోహన్.

"నా కెప్పుడూ ఇష్టమే" అన్నది లీల.

ఈ సంభాషణ ఎప్పుడూ లీలకి మనస్సులో మెదులు తూనేవుంది. అందుకనే ఇంటికి రాగానే కుటుంబం క్లుప్తంగా జరపాలని సంకల్పించుకొని మోహన్‌తో మాట్లాడింది.

"నీ యిష్టం" అన్నాడు మోహన్. "ఇద్దరం — మనకి జరగదా?" అని చిరునవ్వు నవ్వాడు.

ఆ చిరునవ్వు లీల అర్థంచేసుకుంది. మోహన్‌కి పిల్ల లంటే ఇష్టంలేదు. తనకూ పిల్లలు కావాలనిలేదు. గంపెడు పిల్లల్ని పెట్టుకుని, సంసారం యీదలేక, చీదరించుకుంటూ బ్రతికే దంపతులను ఆమె అనేకమందిని చూచింది. ఎందు కనో కళకు, పిల్లలకు పడదని ఆమెనమ్మకం. మోహన్‌ని - తనమోహన్‌ని - కళోపాసకుడైన మోహన్‌ని పిల్లలతండ్రిగా ఆమె ఊహించుకోలేక పోయింది....

మోహన్ తన్మయత్వంతో చిత్రం గీసుకుంటూ వుం టాడు. చిన్న 'కొడుకు' 'నాన్నా?' అంటూ దగ్గరకు వెడతాడు. మోహన్ ఉలిక్కిపడి ఏదో లోకంలోనుంచి క్రిందికి చూసి

నట్టు చూస్తాడు. కొడుకు "కాసీ" అంటాడు.

కూతురు వొస్తుంది. మోహన్ చిత్రం గీసుకుంటూ వుంటాడు; ఎప్పుడు పూర్తి అవుతుందా అనే తహతహతో వుంటాడు. "నాన్నా?" అంటుంది కూతురు. కుంచె చేత్తో పట్టుకుని మోహన్ తిరిగి చూస్తాడు. "ఎత్తుకో" అంటుంది కూతురు.

తను వొస్తుంది. మోహన్ చిత్రం గీసుకుంటూ వుంటాడు. "మోహన్, నామోహన్?" అని పిలుస్తుంది. అతను ఆశగా తిరిగి చూస్తాడు. తనని చూచి నిర్విణ్ణుడౌతాడు. తను తనుగా లేదు. ఇప్పుడు పిల్లలతల్లి. సౌందర్యం నశించింది, యౌవనం సడిలింది, శరీరం ముడతలు పడింది.

"ఎవరు నువ్వు?" అంటాడు మోహన్.

"నీ లీలని" అంటుంది తను.

"కాదు, కాదు" అంటాడు మోహన్. చేతులోని కుంచె జారవిడుస్తాడు. ప్రక్కనున్న కుర్చీలో కూలబడతాడు.

"వొద్దు, పిల్లలు వొద్దు" అనుకుంది లీల, పైవిధంగా ఊహించుకుని. . . .

అప్పటినుంచీ లీల ఇల్లు కదలదు. షికారు వెళ్లదు. ఆప్తులను కూడా చూడదు. ఎప్పుడూ మోహన్ సరసనే వుండేది. చిత్రరచనకు కావలసినవన్నీ అమర్చి పెట్టేది. అతనికే యిబ్బందీ కలగకుండా చూస్తూవుండేది. తనకి సొంత జీవితమనేదే లేకుండా చేసుకుంది. మోహన్ జీవితమే తన జీవితం

ఈ విధంగా రోజులు గడుస్తున్నై. మోహన్ చిత్రాల

మీద చిత్రాలు గీస్తున్నాడు. ఎప్పుడూ లీల అతని ప్రక్క నేవుండాలి. లీల లేకపోతే అతని కుంచె నడవదు. ఆమె వొక్క క్షణం కనిపించకపోతే వెర్రివాడిలాగ 'లీలా, లీలా' అంటూ వెతికేవాడు.

అతను తనకోసం ఇంత తపించిపోవటం లీల మనస్సుకి అమిత ఆనందాన్ని కలిగించేది. తన సౌందర్యం మోహన్ చేత అనేక చిత్రాలు గీయించటానికి కారణభూతం అయినందుకు ఆమె శరీరంలోని ప్రతిఅణువూ గర్వించేది.

"నా పిచ్చి మోహన్! నేను లేకపోతే ఏమైపోయేవాడివో" అని ముంగురులు సవరించేది.

"నీవు లేనినాడు ఈ మోహన్ లేడు" అనే వాడు మోహన్.

ఈమాట ఆమెహృదయాన్ని ఎంత కదిలించేదని! మళ్ళీ మళ్ళీ ఆమాటే అతనితో చెప్పించుకొని వినాలని ఉవ్విళ్ళూరేది.

సాధారణంగా వారు ప్రతిసాయంకాలమూ పెరటిలో వున్న జాజిపూపొదరింటిలో కుర్చీలు వేసుకుని కూర్చునే వారు. అటువంటి సమయాల్లో పునుగు, జవ్వాజి, మంచి గంధం మొదలైన పరిమళ ద్రవ్యాలు వెంట తీసుకురావటం అతనికి అలవాటు. ఆ పరిమళద్రవ్యాలను పదిలంగా ఆమె పక్కనవుంచి, చక్కగా విచ్చిన సన్నజాజులను ఇన్ని ప్రుణికి ఆమెతలలో తురిమేవాడు. సుగంధద్రవ్యాలను ఆమెకంఠసీమకు రాసి తనచేతులకింత పట్టించుకొనేవాడు. ఆ మత్తెక్కించే సువాసనల్లో ఆమెకు పుస్తకాలుచదివి వినిపించేవాడు. ఆపుస్తకాలామెకి అర్థమయ్యేవికావు. అతను ముని

వేళ్ళతో పేజీలు త్రిప్పటంమాత్రం ఆమెను ప్రబలంగా ఆకర్షించేది.

అతను మధ్యమధ్య "ఓహో, ఏమి మహోన్నత భావాలు" అనేవాడు. ఆమె 'అవును' అనేది, అతని మునివేళ్ళవంక చూస్తూ.

"లీలా, ఇలా చదువుకుంటూ, చిత్రాలు గీసుకుంటూ ఒకరికొకరు లోకరు ప్రపంచంలోవున్న కీచులాటల కతీతంగా జీవించటంకంటే ఇంకేం కావాలి?" అనేవాడతను.

"అవును" అనేది లీల, అతని మునివేళ్ళవంక చూస్తూ.

"లీలా, మనం ఆదర్శ దంపతులం కాదూ? ఎంత అదృష్టవంతులం" అనేవాడు మోహన్ ఆమెను తన కౌగిలిలోకి తీసుకుంటూ.

ఆక్షణం ఆమెకు స్వర్గలోకంలో మందాకినిలో స్నానం చేసినట్టు వుండేది. కాని, మరుక్షణమే లోపలనుంచి ఏదో ఆవేదన – అసంతృప్తి పుట్టుకొచ్చేవి. అలా అసంతృప్తి కలగటం తన లోపమే అనుకొనేది లీల. మోహన్ వెడుతున్న స్థాయిని తను అందుకోలేక పోతున్నందుకు తన్ను తాను నిందించుకునేది.

వెంటనే ఆమెకు కుటుంబపరిస్థితులు జ్ఞాపకం వచ్చేవి. ఊళ్లో వున్న కళాజీవులందరూ మోహన్ చిత్రాలను పొగిడేవారే. కాని, అతని చిత్రాలను కొనేవాళ్ళెవరూ కనిపించరు. ఎవరో ఒకరు తప్పకుండా వస్తారనుకునేది లీల. "ఎక్కడో ఒక రసహృదయుడు వుండి వుండకపోతాడా, ఎప్పటికో వొకప్పటి కతను రాకపోతాడా" అని నిరీక్షిస్తూవుండేది లీల.

ఒకనాడు అతను రానేవచ్చాడు. తన బొమ్మకచిత్రం వ్రాసిపెట్టమని మోహన్‌ని కోరి వెళ్ళిపోయాడు.

మోహన్ ఆ చిత్రరచనకి పూనుకున్నాడు. తనచాతుర్యాన్నంతా చూపి గొప్పచిత్రాన్ని సృష్టిస్తానన్నాడు లీలతో. లీల చిత్రం త్వరగా పూర్తిచెయ్యమని తొందరపెట్టింది. ఎక్కడ ఆలస్యమైపోతుందో అనేభయంతో అతనికి కావలసిన వస్తువులన్నీ అడగకుండానే అందించేది. రంగులు నిండుకుంటున్నై. కుంచెలు మారిపోతున్నై. క్రమక్రమేణా చిత్రం మానవాకృతిని తాల్చింది. ఆచిత్రాన్ని చూచుకొని మోహన్ ఉప్పొంగిపోయాడు. ఆ చిత్రంలో తాను స్ఫురింపజేసిన భావాలను లీలకు విప్పిచెప్పాడు. ఆమెకుకూడా అదొక బ్రహ్మాండమైన కళాఖండంగా కనిపించింది. ఇద్దరూ ఆనంద పరవశులయ్యారు.

మర్నాడు ఆచిత్రం వ్రాయుమని కోరిన పెద్దమనిషి వచ్చాడు. మోహన్ అతనికి చిత్రం చూపించాడు. అతనేమంటాడో అని ఆతురతగా చూస్తూ నుంచుంది లీల. ఆ పెద్దమనిషి చిత్రాన్ని పరిశీలించి చూచాడు.

"అబ్బే" అని చప్పరించాడు.

"ఏమిటి?" అనిఅడిగాడు మోహన్. అతనికి ప్రపంచం అంతా గిర్రుమని తిరుగుతూవున్న ట్లనిపించింది.

"ఇదేం బొమ్మ?" అన్నాడు పెద్దమనిషి.

"ఏం?" అడిగాడు మోహన్.

"నేను వ్రాయమన్నది ఇలా కాదు" అన్నాడు పెద్దమనిషి.

మోహన్‌కి కోపం ఎక్కువ అయింది. "ఈసంస్కారం లేనివాడు వ్రాయమనటం, తను వ్రాయటమూనా?" అని పించింది. అతను వ్రాయమన్నట్టు తను వ్రాయనందుకు లీలగా సంతోషం కలిగింది.

"నా ఇష్టం వచ్చినట్టు నేను వ్రాశాను" అన్నాడు.

"అయితే బొమ్మమీరే వుంచుకోండి" అన్నాడు పెద్ద మనిషి.

"సరే, మీరు వెళ్ళండి" అన్నాడు మోహన్.

ఆ పెద్దమనిషి గబగబ వెళ్లిపోయాడు. లీలకి ఏం చెయ్యాలో తోచలేదు. అలాగే నిర్విణ్ణురాలై చూస్తూ నిల బడింది.

అతడు వెళ్ళిపోగానే మోహన్ కోపోద్రేకంతో వొళ్లు మరచిపోయాడు. "మూర్ఖులు, సంస్కార శూన్యులు, కళాదరిద్రులు" అని ఏమేమో గొణుక్కోటం మొదలు పెట్టాడు. లీల మొహం చూడలేక పోయాడు. లీల హృదయం ముక్కలై వుటుందని అతనికి తెలుసు. ఆమె ముఖంలో తాండవించే నిరాశను చూడటాని కతనికి భయం వేసింది. బయటికి వెళ్ళి పోయాడు.

చేతనా రహితంగా నిలబడి పోయింది లీల. ఎంత సేపు అలా నిలబడిందో ఆమెకే తెలియదు. తాము అహో రాత్రాలు కష్టపడి పూర్తిచేసిన చిత్రం ఎదురుగుండా కని పిస్తూ వుంది. తనవంకకే చూస్తున్నట్టుంది. ఆ చిత్రాన్ని తయారు చెయ్యటానికి తాము ఉపయోగించిన రంగులూ, కుంచెలూ అక్కడే వున్నాయి; తన వంకకే చూస్తున్నాయి. మోహన్

చేత గొప్ప చిత్రాన్ని వ్రాయించటానికి తానుపడిన శ్రమతో ఆగది వుడికి పోతూవుంది. ఆగదిలోని ప్రతివస్తువూ ఆసంగతే చాటి చెపుతూ వుంది ఆమె అక్కడ నిలబడలేక పోయింది. భారంగా అడుగులు వేసుకుంటూ కిటికీ దగ్గరకు నడిచింది. ఆకాశంకేసి చూచే సరికి మబ్బులు కమ్ముతున్నై. అకస్మాత్తుగా ఆమెకు పుట్టింటికి వెళ్ళాలనిపించింది. ఎన్నడూ లేనిది ఇప్పుడిలా ఎందుకనిపించింది? ఆలోచించింది. ఒక్క-సారి తన జీవితం అంతా జ్ఞాపకం వచ్చింది లీలకి. తన జీవితం అంతులేని అగాధంగా కనిపించింది. తల్లీ, తండ్రీ, అన్నా, చెల్లెలూ అంతా జ్ఞాపకం వచ్చారు.

"అమ్మా, నువ్వు చిన్నదానవు. నామాట విను" అన్నాడు తండ్రి.

"ఆయన మనస్సు వెన్నపూస, నాన్నా" అన్నది తను.

"అది సుగుణం కాదమ్మా. జీవితాన్ని ఎదుర్కొనే ధైర్యం లేకపోవటంవల్ల వచ్చే బలహీనత" అన్నాడు తండ్రి.

"చూడు నాన్నా, వారికిఆడవాళ్ళంటే ఎంతభక్తోను" అన్నది తను.

"ఆడవాళ్ళంటే భక్తేమిటమ్మా!" అన్నాడు తండ్రి.

"కాదు, నాన్నా. స్త్రీలంటే వారికి ఎంతో గౌరవం. ఎంత మెత్తగా, ఆహ్లాదకరంగా మాట్లాడతారు!" అన్నది తను.

"అందరి స్త్రీలనూ ఒకేరకంగా చూడగలిగిన వాడు భార్యను సుఖపెట్టలేడు, తల్లీ" అన్నాడు తండ్రి.

ఇప్పుడు తన తండ్రిమాటలు నిజమేనేమో అనిపించింది లీలకి. మోహన్ గీసిన చిత్రాలు చూడటానికి అనేక

మంది ఆడవాళ్లు వస్తూవుండేవారు. వాళ్ల అందరితోనూ తనతో వుండేటట్టుగానే చాలా చనువుగా వుండేవాడు మోహన్. వాళ్లందరికీ పునుగు, జవ్వాది, మంచిగంధం ఇస్తూ వుండేవాడు. సన్నజాజి పువ్వులు కోసి, దండలుగా గుచ్చి వాళ్లకి ఇస్తూవుండేవాడు. మోహన్ దృష్టిలో తనూ, తక్కిన స్త్రీలూ ఒకటేనా? భేదం లేదూ? తనమీద ప్రత్యేకంగా ప్రేమలేదూ? స్త్రీలని ఆరాధించటం ఆతని స్వభావం. తనని ఆరాధించటానికి కూడా ఇదేనా కారణం? తన ప్రత్యేకత కాదూ? తనసౌందర్యం కాదూ? తన బుద్ధికుశలత కాదూ? పోనీ, తన భక్తి అయినా కాదూ?

ఈ ఆలోచనలతో ఆమె హృదయంలో తుపాను రేగింది. చూపులు వీధివైపు మరలించింది. వీధిలో స్త్రీలూ, పురుషులూ గందరగోళంగా ఇటూ, అటూ పరిగెత్తుతున్నారు. ఆమెకంతా కొత్తగా కనిపించింది. మోహన్‌తోపాటు ఊహా సౌధాలలో నివసిస్తున్న ఆమెకి ప్రపంచమే కొత్తదైపోయింది. అటు చూడలేక మొహం మరొకవైపుకి త్రిప్పింది. అక్కడ కొంతమంది పిల్లలు ఆడుకుంటున్నారు. తనూ, మోహన్ పిల్లలు కలగకూడదని చేసుకున్న నిశ్చయం జ్ఞాపకం వచ్చింది. వెంటనే తన స్నేహితురాలు విమల తలపుకి వచ్చింది.

విమల తన చిన్ననాటి స్నేహితురాలు. ఇద్దరూ కలిసి చదువుకున్నారు. ఒకసారి తన వివాహమైన తరవాత తనని చూచిపోదామని వచ్చింది. విమలని చూస్తే తనకి ప్రాణం లేచివచ్చింది. ఆమెకు మోహన్ గీసిన చిత్రాలన్నీ చూపించింది. మోహన్‌యొక్క గొప్పతనాన్ని గురించి చెప్పింది.

అతని ఉన్నతభావాలను పొగిడింది. విమల అన్నీ విని, "సరే, మరి నువ్వేం చేస్తున్నావు?" అని అడిగింది.

"నేనా......?" అని తబ్బిబ్బుపడ్డది తను. ప్రత్యేకం తనేమీ చెయ్యటంలేదనీ, ఏదో ఒకటి చెయ్యావలసిన బాధ్యత తనమీద వున్నదనీ అప్పుడు తెలిసింది తనకి.

"ఏమీ చెయ్యటం లేదు" అన్నది తను.

"ఎందుకని?" అడిగింది విమల.

"మోహన్ నేను ప్రకటని లేందే చిత్రాలు వ్రాయ లేడు," అన్నది తను.

"అదేమిటి లీలా ? నువ్వు చదువుకున్న దానివి. నీకు మాత్రం నీ సొంతజీవితమనేది వుండకర్లా?" అన్నది విమల.

"నాకు అవసరం కనిపించటం లేదు. మోహన్‌కి సహాయం చెయ్యటంలోనే నాకు ఆత్మానందం కలుగుతూవుంది" అన్నది తను.

ఈ మాటకి విమల తనవైపు వింతగా చూసింది. ఆ చూపులు ఇప్పటికీ తనని వెన్నాడి, ములుకులుగా గుచ్చుకుంటున్నై. విమల సంఘసేవ చేస్తూవుందట. సంఘంలో స్త్రీలూ, బీదవాళ్ళూ పడుతున్న కష్టాలను గురించి, వాటి నివారణోపాయాలనుగురించి గంటసేపు మాట్లాడింది. "పురుషుడికి బానిసగా వుండటంకాదు, స్త్రీకి సొంతజీవితం వుండాలి. స్త్రీకూడా మనిషే. ఆమెకూ సొంత ఆలోచనలూ, సొంత ఆవేదనలూ వుంటాయి. అవి తీర్చుకోవాలి" అని చెప్పింది. చివరికి వెడుతూ వెడుతూ "మీ మోహన్ చాలాస్వార్థపరుడుగా కనిపిస్తున్నాడు లీలా. ఎంతసేపూ తన సుఖమే కాని

నీ సంగతి ఆలోచిస్తున్నట్టే లేదు" అన్నది విమల.

"అయ్యో, వారి నలా అనకు" అన్నది తను.

"మరి ఆయన చేస్తూవున్న పనేమిటి?"

"వారు నన్ను చెయ్యమన్నారా? నాకు ఇష్టమయ్యే చేస్తున్నాను."

"నీకు ఇష్టమయితేమాత్రం? ఆయన తెలిసినవాడు గదా, నీకు తెలియచెప్పవలసిన బాధ్యత ఆయనమీద లేదూ?"

లీల ఆలోచించింది. తనకు సొంతజీవితం అనేది లేదా? విమలమాటల్లో ఎంతవరకు సత్యం వుంది? తనకు సొంత జీవితం లేకపోవటం ఏమిటి? మోహన్‌కి ఉత్సాహం కలిగించి అతనితో గొప్పగొప్ప చిత్రాలు గీయించటం, ఘనకార్యాలు చేయించటం అదే తనజీవితం. ఒకరికి సహాయం చెయ్యకుండా ఎవరికి వారే ఒక చిన్నప్రపంచాన్ని సృష్టించుకొని కూచుంటే, ప్రపంచంలో సఖ్యత ఎలా వుంటుంది? సహకారం ఎలా కుదురుతుంది? అభివృద్ధి ఎలా జరుగుతుంది? మరి తనకెందుకీ అసంతృప్తి? ఎవరిమీద? దేనికోసం? తనమీద తనకేకాదు గదా! ఇంతవరకు ఉత్సాహం, ఆనందం ఇచ్చే విషయాలు ఇప్పుడు తన కెందుకివ్వక పోవాలి? తప్పు ఎవరిది? తనదా, మోహన్‌దా? మోహన్ తప్పేమి వుంది? ఎంత వితర్కించుకున్నా, అతని తప్పు కనిపించటంలేదు. తన్ను మొదటినుంచీ ఎంత ఆప్యాయంగా, ప్రేమగా చూస్తున్నాడో, ఇప్పుడూ అదే విధంగా చూస్తున్నాడు. అతనిలో రవ్వంత మార్పుకూడా లేదు. అవే ఆలోచనలు... అవేమార్పులు... అవేచర్యలు... అదే దృష్టి... ఇక అతని తప్పేమి వుంది? పోనీ, తనుమాత్రం

ఏం చేసింది? మోహన్ని సంతోషపెట్టటానికి తనకు చేత నయినంతవరకూ ప్రయత్నిస్తూనేవుంది. అతన్ని ఇంకాగాఢంగా ప్రేమిస్తూనేవుంది. కాని, ఇదివరకు తన్ను అంతగా కదిలించిన మాటలు ఇప్పుడెందుకు కదిలించలేక పోతున్నై? ఇదివరకు అతడు చెంతన కూర్చుంటేనే పరవశత్వం కలిగేది. ఇప్పుడు విసుగుపుడుతూవుంది. అతని మాటల్లోని మెత్తదనం మొహం మొత్తుతూవుంది. కొంచెం గట్టిగా, దర్జాగా ఎందుకు మాట్లాడడు? ఆయనకు కోపం వొస్తే చూడాలనిపించేది తనకి. ఆయన కేకలు వేస్తే ఎలా వుంటుంది?

తన వివాహానికి ముందు తను తన స్నేహితురాండ్రతో వున్నప్పుడు ఆయన వొచ్చి, తన సరసన కూర్చొని మాట్లాడుతుంటే తన కెంతో గర్వంగా వుండేది. ఇప్పుడు ఇతరుల ఎదట ఆయన దగ్గరగా ఉంటేనే సిగ్గుగా, ఎల్లాగో ఉంటూవుంది. ఎందుకని? వాళ్ళేమన్నా అనుకుంటారనా? ఇదివరకు ఇతరులు అలా అనుకోవటం గర్వకారణంగా ఉండేదే! ఇప్పుడు ఎందుకని?

తాను మారిందా? మారటానికి అతడు ఆర్జించక పోవటం కారణమా? ఆర్జన లేకపోవటం అనేది ఆయనకూ వున్న బాధేగా! కాని ఆయన బాధపడుతున్నట్లు కనపడడు.

పోనీ, విమల చెప్పినట్లు సంఘసేవ చేస్తే? అప్పుడు తన మోహన్ ఏమవుతాడు? తాను ఇప్పటికి మల్లే ప్రేమించ గలుగుతుందా? ఒకవేళ ప్రేమించలేకపోతే? ఒక్కసారి ఆమెకు జీవితం ఎడారిగా కనిపించింది. అనేక ఊహాలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న ఆమెహృదయం అకస్మాత్తుగా

శూన్యం అయింది. మోహాన్ని - తన మోహాన్ని ప్రేమించ లేక పోవటమే !

"లీలా ?"——ఎవరి దాపిలుపు ? ఎక్కడ విన్నది ఆ పిలుపు? అజంతా-హంపీ-శ్రీరంగం-కంచి-మధుర-ఎల్లోరా...

మోహన్ గదిలోకి వొచ్చాడు. ఏదో ఆతురతగా చెప్పబోయాడు. ఆమె కళ్ళల్లో అశ్రువులు చూశాడు.

"ఇదేమిటి ?" అని అడిగాడు.

"ఏమీ లేదు" అన్నది లీల.

వెంటనే రహస్యాలు ఉంచుకోగూడదని తాము చేసుకున్న నిశ్చయం జ్ఞాపకం వచ్చింది. కాని ఏమని చెపుతుంది ?

## సంఘం - వర్గం

కాంగ్రెస్ వారు ఐక్యతనుగురించి మాట్లాడుతూ సంఘంలో భిన్న వర్గాలు లేనట్లు మాట్లాడినట్లే, తీవ్రవాదులు వర్గాలసంగతి మాట్లాడుతూ వీటన్నిటినీ కూడగట్టుకొని అభివృద్ధి చెందుతున్న సంఘం అనేది లేనట్లు మాట్లాడుతున్నారు.

ఈమధ్య ఒక రచయిత తనపుస్తకంలో "ఇది మధ్యతరగతికి వ్రాసిన పుస్తకం" అని వ్రాశాడు.

ఒక తరగతికి వ్రాయటం ఏమిటీ ? ఆ తరగతితప్ప మరెవ్వరూ చదవ గూడదనా ? చదివినా ప్రయోజనంలేదనా? ఈ దృష్టి, వర్గాలనుతప్ప వాటిని ఇముడ్చుకొనివున్న సంఘాన్ని మరచిపోవటంవల్ల వొచ్చింది. ఆ సమస్య ప్రత్యేకం ఒక వర్గానికి చెందిందే గావచ్చు. కాని మొత్తం సంఘానికి సంబంధించిందికూడా ! ఆ సమస్యవల్ల ప్రత్యేకం ఒక తరగతి బాధపడుతూ వుండవొచ్చు. కాని మొత్తం సంఘం కూడా దానివల్ల కలవరపడుతూనే వుంటుంది.

సంఘాన్ని ముక్కలుగానేకాక ఒకటిగా కూడా చూడలేకపోవటం వల్ల వొచ్చిన చిక్కు యిది.

# బోల్తా కొట్టిన రిక్షా

గణ గణ గణ గణ

ఒక బక్కచిక్కిన రిక్షావాడు బాగా బలిసివున్న వ్యాపారస్తుణ్ణి తన రిక్షామీద కూర్చోబెట్టుకొని లాక్కువెళ్తున్నాడు. ఎంతదూరంనుంచి లాక్కువెళ్తున్నాడోగాని, తెగ రొప్పుతున్నాడు అతని అడుగులు కింద వాలుతున్నట్లులేవు. గాలిమీద తేలిపోతున్నాడు. రిక్షా ముందుకు నడుతుంటే, తానుదాన్నిపట్టుకొనివేళ్లాడుతున్నట్లుఅనిపించింది. వ్యాపారస్తుడికి, మానవునికి వుండవలసిన అవయవాలన్నీ వున్నై. కాని, వుండవలసిన మోతాదులోలేవు. బొజ్జ పెద్దది. అంచేకని కాళ్లు బారజాచి, వెనక్కి ఆనుకొని, గోడకి నిలవేసిన తవుడు బస్తాలా కూర్చొనివున్నాడు. ఆ రిక్షావాణ్ణీ, వ్యాపారస్తుణ్ణీ, ఎక్కడో చూచినట్టు అనిపించిందినాకు. అనిపించటం జ్ఞాపకం రావటం రెండూ ఇంచుమించు ఒకేసారి జరిగినై. ఆ రిక్షా, భారతదేశం. రిక్షావాడు, భారతదేశంలోవున్న మూర్తీభవించిన దారిద్ర్యం ఆ వ్యాపారస్తుడు, కేంద్రీకరించిన రొఖ్ఖం.

"ఆపరా!" అన్నాడు వ్యాపారస్తుడు.

రిక్షావాడు ఆగాడు. కొంతసేపటికి రిక్షా ఆగింది.

రిక్షాలోనే కూర్చొని వ్యాపారస్తుడు ఎవరితోనో మాట్లాడుతున్నాడు. అతనువాళ్ళకొట్లో గుమాస్తా. ఆ వ్యాపారస్తునికి మూడు ఫ్యాక్టరీలూ, రెండు బట్టలకొట్లూ, ఒక పెద్ద పచారీషాపూ వున్నాయి. మొత్తం అతని వ్యాపారాన్ని

'బ్లాక్ మార్కెట్ వ్యాపారం' అని పిలవొచ్చు.

"వాళ్ళకేం? వాళ్లు అట్లాగే అంటారు. బ్లాక్ మార్కెట్టట! వ్యాపారధర్మం తెలియకపోతే సరి. వొచ్చేటప్పుడు రాబట్టుకోకపోతే, చెయ్యిదాటింతర్వాత ఇమ్మంటేఇస్తారా?" అంటున్నాడు వ్యాపారస్తుడు.

"ముందీ ఆఫీసర్లతో చస్తున్నాం" అన్నాడు గుమ్మస్తా.

"వాళ్ళముడుపుకోసం వాళ్లు" అని చీదరించుకున్నాడు వ్యాపారస్తుడు.

"చిత్తం" అన్నాడు గుమ్మస్తా.

"వాళ్లనోళ్లు మూతవెయ్యటం ఎంతసేపూ?" అన్నాడు వ్యాపారస్తుడు చిరునవ్వు నవ్వుతూ.

వ్యాపారస్తుని మొహాన చిరునవ్వు కనపట్టం అన్నప్పుడూ జరిగేపనికాదు. నూటికి కోటికి ఒకసారి తళుకున మెరుస్తుంది.

గుమ్మస్తా ఆ దర్శనభాగ్యానికి వుబ్బితబ్బిబ్బు అవుతూ, "చిత్తం చిత్తం, తమరు తలచుకుంటే ..." అన్నాడు.

"నడవరా" అన్నాడు వ్యాపారస్తుడు రిక్షావాణ్ణి. వాడు నడిచాడు. వాడివెంటే రిక్షానడిచింది.

గణ గణ...గణ గణ.

రిక్షావాడు బహుకష్టంమీద లాగుతున్నాడు. గుమ్మస్తాతో మాట్లాడింతర్వాత వ్యాపారస్తుడు రెట్టింపు బరువెక్కాడు. కొంచెందూరం వెళ్ళింతర్వాత, "ఆపరా" అన్నాడు వ్యాపారస్తుడు మళ్ళీ.

రిక్షావాడు ఆగాడు: వెంటనే రిక్షా ఆగింది.

వ్యాపారస్తుడు రిక్షామీద కూర్చునే, మరొకరితో మాట్లాడుతున్నాడు. "ధరలు పెరిగేటట్లున్నాయి. మనకేం తొందరా?" అన్నాడు కొత్తమనిషి.

"స్టాక్ చెయ్యండి" అన్నాడు వ్యాపారస్తుడు.

"చిత్తం. కాని, ఈ అలకాజనం గోల పడలేకుండా వున్నాం" అన్నాడు కొత్త మనిషి.

"వాళ్ల దెప్పుడూ ఉండేగోలే!" అన్నాడు వ్యాపారస్తుడు.

"చిత్తం. ఫ్యాక్టరీలచుట్టూ మిడతల దండుకు మల్లే మూగుతున్నారు"

"పోలీసుకి కబురుచెయ్యండి" అన్నాడువ్యాపారస్తుడు.

"చిత్తం" అన్నాడు కొత్తమనిషి.

"నడవరా!" అన్నాడు వ్యాపారస్తుడు రిక్షావాణ్ణి. రిక్షావాడితో పాటు రిక్షాకదిలింది. ఈసారి వ్యాపారస్తుడు మూడురెట్లు బరువెక్కాడు.

గణ...గణ...గణ...గణ!

రిక్షావాడు లాగలేక, లాగలేక లాగుతున్నాడు: రిక్షా కదల్లేక, కదల్లేక కదులుతూవుంది.

"ఆపరా" అన్నాడు వ్యాపారస్తుడు.

రిక్షా ఆగేవుంది.

ప్రక్కన ఆదుర్దాగా వెళ్తున్న పెద్దమనిషిని పిలిచి మాట్లాట్టం మొదలుపెట్టాడు వ్యాపారస్తుడు.

"కార్మికులూ, కమ్యూనిష్టులూ ఫ్యాక్టరీలను చుట్టు ముట్టారు" అన్నాడు పెద్దమనిషి.

కమ్యూనిస్టులా ?" అని భయపడ్డాడు వ్యాపారస్తుడు.

"ఆఁ !" అన్నాడు పెద్దమనిషి.

"వాళ్ళ కేం పనీ ?" అడిగాడు వ్యాపారస్తుడు.

"వాళ్ళే కార్మికుల్ని పోగుజేసింది" చెప్పాడు పెద్ద మనిషి.

"ప్రభుత్వం వూరుకుందా?" అడిగాడు వ్యాపారస్తుడు.

"పోలీసులను పంపింది" చెప్పాడు పెద్దమనిషి.

"వాళ్ళు ఊరుకున్నారా?" అడిగాడు వ్యాపారస్తుడు.

"తుపాకులు పేల్చారు" చెప్పాడు పెద్దమనిషి.

"ఆఁ?" అన్నాడు వ్యాపారస్తుడు.

"పదిమంది మరణించారు. పాతికమందికి గాయాలు తగిలినై. వందమందిని అరెస్టుచేశారు" అన్నాడు పెద్దమనిషి.

"కమ్యూనిస్టుల్నో ?" అడిగాడు వ్యాపారస్తుడు.

"అందర్నీ అరెస్టుచేశారు" చెప్పాడు పెద్దమనిషి.

"ఇప్పు డెలావుంది ?" అడిగాడు వ్యాపారస్తుడు.

"గుంపంతా చెల్లాచెదరైంది" అన్నాడు పెద్దమనిషి. "ఫ్యాక్టరీలను పోలీసులు కాపలా కాస్తున్నారు"

వ్యాపారస్తుడు రిక్షాలో కూర్చునే ఆలోచించాడు. కమ్యూనిస్టుల్ని హతమార్చాలి. లేకపోతే తననోట మట్టే. తన బ్రతుకు కత్తిమీద సాము అవుతుంది. "ప్రభుత్వంలో అంతా మనకు తెలిసినవాళ్ళే. వాళ్ళ చెవిని ఒకమాట వేసివాస్తే మంచిది" అనుకున్నాడు.

"నడవరా" అన్నాడు రిక్షావాణ్ణి.

రిక్షావాడు ఒక గుంజు గుంజాడు. ఈ సారి వ్యాపా

రస్తుడు నాలుగురెట్లు బరువెక్కాడు.

గణ గణ గణ గణ

పక్కగా మనుష్యులు వెళ్తున్నారు. బళ్ళు వెళ్తున్నై. కార్లు వెళ్తున్నై. రిక్షావాడు బరువు మొయ్యలేకపోతున్నాడు. రిక్షా లాగలేక పోతున్నాడు.

గణ గణ గణ గణ.

వ్యాపారస్తుడు ప్రభుత్వంవారితో ఎలా మాట్లాడవలసిందీ ఆలోచిస్తున్నాడు. కమ్యూనిస్టులమీద ఏమి చెబితే వారికి నచ్చుతుందో ఊహించుకుంటున్నాడు... కమ్యూనిస్టులు ప్రధానమంత్రిమీద చేస్తున్న దుష్ప్రచారం, మొన్న మీటింగులో వాళ్ళు ఆయన్ని తిట్టిన తిట్లూ...

గణ గణ గణ గణ

రిక్షావాడు ఊగిపోతున్నాడు. ఎదురుగా సైకిలు వొచ్చింది. "ఆఁ! ఆ!" అన్నాడు వ్యాపారస్తుడు. భయంతో వెనక్కి వొరిగాడు. రిక్షావాడు అదిమిపట్టుకోలేక చేతులు వొదిలాడు. రిక్షా తల్లక్రిందయింది. వ్యాపారస్తుడు బోర్లబొక్కలా పడ్డాడు. రిక్షా విరిగింది. రిక్షావాడు కూలబడ్డాడు. వ్యాపారస్తుడు తన దెబ్బలు చూచుకొని కన్నీరు పెట్టుకుంటున్నాడు. రిక్షావాడికి తన సంగతి పట్టలేదు. "అయ్యో, నా రిక్షో" అని విలపిస్తున్నాడు—విరిగిన రిక్షాని తడుముతూ!

వాళ్ళని చూస్తుంటే, మూర్తీభవించిన దారిద్ర్యం భారతదేశానికి నష్టం కలిగిందని విలపిస్తున్నట్లూ, కేంద్రీకరించిన రొఖ్ఖం, తనకు ఇబ్బంది కలిగిందని కన్నీరు పెట్టుకుంటున్నట్లూ అనిపించింది నాకు.

# రెండు జీవాలు : నిండు హృదయాలు

జిజియా, కమలాకరం మద్రాసునుంచి వచ్చే రైల్లో దిగారు. మద్రాసులో ఒక కాలేజీలో కమలాకరం ప్రొఫెసరు. ఆ కాలేజీలోనే జిజియా ఆనర్సు పరీక్ష చదివింది.

కాలేజీ సారస్వతసంఘానికి జిజియా సెక్రటరీ, కమలాకరం ప్రెసిడెంటు. ఈవిధంగా వాళ్ళిద్దరికీ స్నేహంకలిగింది. వాళ్ళిద్దరికీ స్నేహం కలగటానికి మరొక కారణంకూడా వుంది. ఇద్దరూ ఒక తాలూకానుంచే వచ్చారు. ఇద్దరి గ్రామాలూ దగ్గరే.

సారస్వతసంఘం పనుల్లో వాళ్లు తరచు కలుస్తూ వుండేవారు. అనేక విషయాలనుగురించి చర్చించుకుంటూ వుండేవారు. వాళ్ల స్నేహం అందరి స్నేహంవంటిదికాదు. అన్నివిషయాల్లోనూ ఇద్దరూ ఒకేవిధంగా ఆలోచించేవారు.

ఇద్దరికీ సంఘసేవ చెయ్యాలనీ, భారతదేశంలోవున్న దారిద్ర్యం పోగొట్టి ప్రజలను బాగుచెయ్యాలనీ అభిలాష వుండేది.

"నాచదువు పూర్తిఅవగానే సంఘసేవ చేస్తాను" అనేది జిజియా.

"దేశం అంతా ఇలా అల్లకల్లోలంగా వున్నప్పుడు ఏమీ అంటనట్టు ఉద్యోగం చేసుకుంటూ కూర్చోటం నాకూ ఏమీ బాగాలేదు" అనేవాడు కమలాకరం.

"మరి ఏం చేస్తారు?"

"ఉద్యోగానికి రాజీనామా పెడదామను కుంటు న్నాను."

వాళ్ళిద్దరూ ఒకరు మహమ్మదీయులు, ఒకరు హిందువులు అయినా—వాళ్ల ఆలోచనలకు మతం ఎప్పుడూ అడ్డువచ్చేదికాదు. భారతదేశం దాస్యంలో, దారిద్ర్యంలో వుండటంవల్ల మహమ్మదీయులూ కష్టపడుతున్నారు; హిందువులూ కష్టపడుతున్నారు. ప్రత్యేకం మహమ్మదీయులకి సహాయం చెయ్యాలి అనుకోటంగానీ, ప్రత్యేకం హిందువులకే సహాయంచెయ్యాలి అనుకోటంగానీ వాళ్లకి బొత్తిగా అర్థమయ్యేదికాదు. సహాయం ఎవళ్ళకి అవసరమో వాళ్లకి చెయ్యాలి. హిందువులలోను, మహమ్మదీయులలోను ధనవంతులున్నారు. ఈ ధనవంతులు వాళ్ళ వాళ్ళ మతాలలో వున్న బీదవాళ్ళని దోచుకుంటూనేవున్నారు. కాబట్టి భారతదేశాన్ని బాగుచెయ్యాలంటే మతదృష్టితో చూడటంవల్ల లాభంలేదు. అన్ని మతాల్లోవున్న బీదవాళ్ళకీ సహాయం చెయ్యగలిగినప్పుడే మొత్తందేశం బాగుపడుతుంది—అనుకుంటూ వుండేవారు.

రైలుస్టేషన్‌లో దిగగానే వాళ్ళ మనస్సులు ఇటువంటి ఉత్తమమైన ఆలోచనలతో తొణికిసలాడుతున్నాయి. వారి వారి గ్రామాలకి వెళ్ళటానికి వారు విడిపోవలసిన సమయంవచ్చింది. స్టేషన్ దగ్గరనుంచి కమలాకరం గ్రామం వెళ్లాలంటే బస్సుమీద ఇరవై మైళ్ళు వెళ్లాలి ఉత్తరంగా. జజియూ గ్రామానికి పదిమైళ్లు వెళ్లాలి దక్షిణంగా.

ఇప్పుడు వారు కొత్తగా మాట్లాడుకోవలసినసంగతు లేమీలేవు. ఏమయినాసరే సంఘసేవకి తమ జీవితాలని అర్పించాలనే సంకల్పాన్ని మళ్ళీ వొకసారి పునశ్చరణ చేసుకున్నారు.

"సెలవు" అన్నది జిజియా.

"మళ్ళీ ఎప్పుడు కనపట్టం?" అడిగాడు కమలాకరం.

దీనికి వెంటనే జవాబుచెప్పలేకపోయింది జిజియా.

"ఇక మావూళ్ళోనే ఉంటాను" అన్నాడు కమలాకరం.

"మరి ఉద్యోగమో?" అన్నది జిజియా.

"మా వూరినుంచే రాజీనామా పంపిస్తాను. కష్టమో నిష్టురమో నేను నిశ్చయించుకున్నాను. ప్రజల సుఖంకోసం నాజీవితం అంకితంచేస్తాను," అన్నాడు కమలాకరం.

"నేనూ అలాగే అనుకుంటున్నాను. ముందు మాగ్రామ ప్రజలకి నాకు చేతనైన సేవచెయ్యటానికి ప్రయత్నిస్తాను" అన్నది జిజియా.

"అయితే, తప్పక కలుసుకుంటాం" అన్నాడు కమలాకరం.

"ఆలోచనలు ఒకటే అయినప్పుడు ఎక్కడ వున్నా కలసివున్నట్టే" అన్నది జిజియా.

వాళ్ళ మనస్సులో అనేక భావాలు పరిగెత్తినై. ఎన్నో సంగతులు చెప్పుకోవాలనుకున్నారు. కాని వాళ్ళకి మాటలు రాలేదు. పైకి మాట్లాడుకోకపోయి నప్పటికీ తమ హృదయాలు విప్పిచెప్పుకున్నట్టేవుంది వాళ్ళకి.

కమలాకరం జిజియాని బండి ఎక్కించి, కనిపిస్తున్నంత సేపూ అలాగే చూస్తూ నుంచున్నాడు.

## 2

జిజియా కమలాకరాల హృదయాలు నిండైనవి; స్వచ్ఛమైనవి. కాని అజ్ఞానంలో, దారిద్ర్యంలో కుళ్ళే ప్రజల పరిస్థితి వేరు. ఆ సంగతి వాళ్ళకి గ్రామాలలో అడుగు పెట్ట గానే తెలిసింది.

కమలాకరం గ్రామంలో హిందువులూ, మహమ్మదీయులూ సగానికి సగంగా వున్నారు. ఇంతకు ముందెప్పుడూ ఆ గ్రామంలో మతకలహాలు లేవు. కాని, కొద్దిరోజులనుంచి గ్రామస్థులలో ఆవేశాలు పెరుగుతూ వచ్చినై. "కారణం ఇది" అని ఎవరూ చెప్పలేరు. అసలే ఉద్రేకాలతో ఉండటం వల్ల, ప్రతి చిన్నవిషయం భయంకర రూపం దాల్చటం మొదలు పెట్టింది. ఆరోజు ఒక మహమ్మదీయ బాలుణ్ణి ఒక హిందువు కొట్టటం, దానితో మహమ్మదీయులకి కోపం రగ లటం జరిగింది. ద్వేషాలు పెరిగిపోయి విచక్షణా జ్ఞానం నశిం చింది రెండు పక్షాలకీ.

అటువంటి పరిస్థితుల్లో కమలాకరం తన గ్రామంలో అడుగుపెట్టాడు. సంగతులు తెలుసుకుని హిందువులకూ, మహమ్మదీయులకూ సఖ్యత కుదర్చటానికి ప్రయత్నించాడు. కాని, లాభం లేక పోయింది.

"నువ్వు హిందువువి" అన్నారు మహమ్మదీయులు.

"నీలో హిందూ రక్తం లేదు" అన్నారు హిందువులు.

కాని, కమలాకరం నిరాశ చెందలేదు. నిష్కల్మష హృదయంతో తన ప్రయత్నం తాను చేస్తూనే వున్నాడు.

ఒక రోజు అతను చీకటిపడి ఇంటికి వస్తూవుండగా ఎవరో అతన్ని పొడిచి చంపివేశారు. ఈ వార్త అతని అన్నకి తెలిసింది. అంతవరకు కమలాకరాన్ని చూసి వూరుకుంటూ వున్న అతని అన్న, ఆవేశంతో విజృంభించాడు. నిర్దాక్షిణ్యంగా మహమ్మదీయులను హింసించటం మొదలు పెట్టాడు.

"రక్తానికి రక్తం" అన్నాడు.

"నా తమ్ముడి ఆత్మశాంతి కోసం" అన్నాడు.

ఆరోజునుంచీ కమలాకరం అన్నే, హిందువులకి నాయకత్వం వహించాడు. తనతమ్ముణ్ణి అకారణంగా చంపారనే కసి అతన్ని అనేక దారుణకృత్యాలకి పురికొల్పింది.

"రక్తానికి రక్తం!"

"నా తమ్ముడి ఆత్మశాంతికోసం."

ఈ మాట లతనికి తారకమంత్రం అయినై.

## 3

గ్రామం అంతా కంపించిపోయింది. ప్రజలు భయంతో గడగడ వొణికిపోయారు. హిందువులుగాని, మహమ్మదీయులుగాని బయటికి అడుగుపెట్టటంలేదు. బయటికి వచ్చిన ప్రాణి మళ్ళీ యింటికివెళ్ళే ఆశలేదు. మతోద్రేకం వీరవిహారం చేస్తూవుంది.

కమలాకరం అన్న పూనకం పూనినవాడికిమల్లే ప్రవర్తించాడు. అతనిదగ్గరకి వెళ్ళటానికిగాని, మాట్లాడటానికి

గాని అందరికీ భయంగా వుంది. ఎప్పుడూ కత్తివిడవకుండా తిరిగేవాడు.

ఇలా వుండగా ఒకరాత్రి ఒకఅమ్మాయి అతనిదగ్గరకు ఒకఉత్తరం పట్టుకువచ్చింది. ఆ అమ్మాయినిచూస్తే కమలాకరం అన్నకి ఆశ్చర్యం కలిగింది. పెద్దవాళ్లే బయటికి రావటానికి భయపడుతున్నరోజులు ఈ పిల్ల ఎలా ధైర్యంచేసింది?

"ఎవరు నువ్వు?" అడిగాడు.

"జిజియా చెల్లెలిని."

ఆపేరు వినగానే కమలాకరం అన్న చెయ్యి కత్తి మీదకు వెళ్ళింది. కాని ఆపిల్ల చలించకుండా అలాగే చూస్తూ నుంచుంది.

అతను ఉత్తరం విప్పిచదివాడు; జిజియా, కమలాకరానికి వ్రాసిన ఉత్తరం అది.

"ప్రియ మిత్రమా!

ఏదీ మనం అనుకున్నట్లు జరగకపోవటం చాలావిచారకరం. నేను రాగానే మా వూళ్లో హిందూ మహమ్మదీయ కల్లోలం ప్రారంభమయింది. శాంతింపజెయ్యటానికి నేనసేక విధాల ప్రయత్నించాను.

ఇవాళ హిందువులు ఒక మహమ్మదీయ బాలుణ్ణి అకారణంగా హింసిస్తూవుంటే చూడలేక అడ్డువెళ్ళాను. "ఇది తప్పు"అని చెప్పాను. "మతకలహం అనర్థదాయకం"అన్నాను. వారు నా మాట వినలేదు. "నీవు మహమ్మదీయ స్త్రీవి; అందుకని వారిపక్ష మాట్లాడుతున్నావ"ని నిందించారు. వారికి కోపం పెరిగిపోయింది.

నన్ను బాకుతో పొడిచారు. పోటు డొక్కలో తగి లింది. నా కెవరిమీదా కోపం లేదు. కాని మనం అనుకున్నట్టు దేశసేవ చెయ్యటానికి వీలులేక పోయిందే అని విచారం. అయినా, మీరు వున్నారుకదా, మనం కోరిన-ద్వేషాలులేని, వర్గాలులేని-మానవ సంఘంకోసం పాటుపడతారు కదా అనే నమ్మకంతో నిర్విచారంగా ప్రాణం విడుస్తున్నాను.

ఇట్లు,

జి జి యా"

ఈ ఉత్తరం చదివేసరికి కమలాకరం అన్న చేతులు వొణి కినై. అతని కళ్ళల్లో నీళ్లు తిరిగినై......

కమలాకరం అన్న జిజియా చెల్లెలిని దగ్గరకు తీసు కున్నాడు; "చెల్లీ" అన్నాడు.

## ఏం కావాలి? ఎలా తెచ్చుకోవాలి?

"రచనకు ప్రయోజనం ఉండాలి అంటారు!"

"లేకపోతే ఎందుకు రచనలు చెయ్యటం!"

"అయితే మీరు మీకథల్లో ఏదీ స్పష్టంగా తేల్చి చెప్పరేం?"

"చిన్నపిల్లల కథల్లోకిమల్లే ప్రతి కథలోనూ 'దురాశ దుఃఖానికిచేటు' అన్నట్లుగా నీతితేలాలి అంటారు!"

"మరి తేలొద్దూ!"

"అక్కర్లేదు. ఒక నీతిని తేల్చి చెప్పిందానికంటే ఒక సంస్కారం, ఒకదృష్టి కలిగించటం ఉత్తమం. అప్పుడు చదువరి తనంతతానే చాలా తేల్చుకోగలుగుతాడు."

"సంస్కారం కలిగించి ఊరుకుంటే సరిపోయిందీ? ఏంచేస్తే ఆసంస్కారం ఆచరణలోకి వొస్తుందో, ఏవిధానం అవలంబించాలో, అవన్నీ చెప్పొద్దూ!"

"ఆ పని వ్యాసం చేస్తుంది."

# జెలసీ

కాంతామతీ, శ్యామలరావూ కలిసి తిరగటం చూసే టప్పటికి బ్రహ్మానందానికి ఆశ్చర్యం వేసింది. పైగా వాళ్ళిద్దరూ తనని చూచి నవ్వుకుంటూ వెళ్లారు. ఒక్క బ్రహ్మానందానికే కాదు, వాళ్ళిద్దరి సంగతీ తెలిసిన ఎవరికైనా ఆశ్చర్యం వేసేదే. మానవ మనస్తత్వం పూర్తిగా తెలుసు అనుకునే బ్రహ్మానందానికి ఆశ్చర్యం కలగటమే కాకుండా, తన తెలివి తేటలమీద తనకే నమ్మకం పోయింది.

అతను మరి ఏ ఇద్దరు కలిసి తిరిగినా అంత చకితుడయ్యేవాడు కాదు. అతను స్త్రీపురుషు లిద్దరు కలిసి తిరగ కూడదనే భావం కలవాడు కాదు. కలిసి తిరిగితే వెర్రి వెర్రి చూపులు చూచే స్వభావం కలవాడు కూడా కాదు. స్వభావ సిద్ధమైన వ్యవహారంగానే పరిగణించేవాడు.

అటువంటివాడు కాంతామతీ, శ్యామలరావూ కలిసి తిరగటం చూసేటప్పటికి చకితుడయ్యాడంటే దానికి ప్రబలమైన కారణం వుండితీరాలి. ఆ కారణం ఇది:

శ్యామలరావు చుట్టపుచూపుగా బ్రహ్మానందం యింటికి వచ్చాడు. అతనికి ఆవూళ్లో కొద్దిగా పనివుందనీ, ఐదారు రోజులుండి పోతాననీ చెపితే, 'మా యింట్లోనూ ఎవరూ లేరు. ఒక్కడినే వుంటున్నాను' అని తన యింటికి ఆహ్వానించాడు బ్రహ్మానందం. అప్పటినించీ తన యింట్లోనే వుంటున్నాడు శ్యామలరావు. రోజులు గడిచిపోతున్నాయి గాని అతను వెళ్ళలేదు. బ్రహ్మానందంకూడా తన పనుల

మీద తానువుండి ఆవిషయానికి ప్రాధాన్యం ఇవ్వలేదు.

ఆరోజు శ్యామలరావు ఇంట్లో లేనప్పుడు తాను స్నానంచేస్తూవుండగా కాంతామతి వచ్చింది.

కాంతామతి చాలాకాలంనుంచీ పక్కయింట్లోనే వుంటున్నప్పటికీ తనకు పరిచయంలేదు. ఎన్నడూ పలకరించుకుని ఎరగరు. తన భార్యకేమన్నా పరిచయం వుందేమోకూడా అతనికి తెలియదు. అటువంటి ఆమె, తన భార్య ఇంట్లోలేదని తెలిసికూడా తాను ఒంటరిగా వున్నప్పుడు రావటం విచిత్రంగా వుంది బ్రహ్మానందానికి.

ఆమె తలుపుచాటున నిలబడి, "మీతో వుంటూ వున్నది మీ బంధువాండీ?" అని అడిగింది.

ఆమె శ్యామలరావును గురించి అడుగుతూవుందని గ్రహించి, "బంధువుకాదు, స్నేహితుడు" అన్నాడు బ్రహ్మానందం.

"ఎవరైతే ఏమండీ, ప్రవర్తన మంచిది కానప్పుడు—" అన్నది కాంతామతి.

ఏదో కొంపమీదకి తేనే తెచ్చాడని భయపడ్డాడు బ్రహ్మానందం. శ్యామలరావుసంగతి అతనికి తెలుసు; కన్నుగీటే స్వభావంవుంది. కాంతామతితో ఏదో అసభ్యంగా ప్రవర్తించి వుంటాడని కంగారుపడుతూ, "ఏమండీ, అతను మంచివాడేనే: ఏంచేశాడేమిటి?" అని అడిగాడు నీళ్లు పోసుకోటానికి పైకిఎత్తిన చెంబు ఆపి.

"ఏం చెయ్యాట మేమిటండీ? చుట్టుపక్కల అంతా గోలగావుంటేనూ? రోజుకొక అమ్మాయిని తీసుకువాస్తు

న్నాడు. పోనీ తీసుకువస్తే తీసుకువొచ్చాడు. తలుపు వేసుకో కూడదుటండీ? తలుపులు బార్లాతీసి ...అయ్యయ్యో, ఇంత విడ్డూరమైతే ఎట్లా చెప్పండి? మాంసం తింటామని బొమికలు మెడకు కట్టుకు తిరుగుతామా? పోనీ, మొగవాడు ఆయ నకు లేకపోతే, ఆడదిగదా తనకైనా వుండకూడదూ? ఎవ రైతేమాత్రం, అంత విడిచేసుకు తిరిగితే ఎట్లా? అందులో పదిమంది కాపురాలున్నచోటు; పెళ్ళికావలసిన పిల్లలు న్నారు..." అంటూ మొదలుపెట్టింది.

బ్రహ్మానందానికి నిజంగా ఒళ్లుమండింది ఈ మాటలు వింటూవుంటే. తనభార్య వచ్చినతరువాత యీ సంగతి ఆమెకు తెలిస్తే? ఆమె యేమనుకుంటుంది? తనకేమీ తెలి యదని చెపితే మాత్రం నమ్ముతుందా? స్నేహితులిద్దరూ కలిసే చేశారు అనుకోదూ?

కోపం దిగమింగి, "నేను కనుక్కుంటానులెండి" అన్నాడు ఆమెను పంపించివెయ్యాలనే వుద్దేశంతో.

"కొంచెం మందలించండి. మనం ఇన్నాళ్ళనుంచీ ఏ పొరుపులూ లేకుండా వుంటున్నాం. ఇట్లా అయితే యిక మేమిక్కడ కాపురాలు చెయ్యలేం. దేనికైనా హద్దూపద్దూ వుండొద్దుటండీ" అంటూ వెళ్ళిపోయింది కాంతామతి.

ఆ రాత్రే శ్యామలరావుని బ్రహ్మానందం చివాట్లు వేశాడు. కాని ఎంత అడిగినా వొప్పుకున్నాడుకాదు.

"అంతా వొట్టిదోయ్. నాకోసం వొక అమ్మాయి వొస్తూవున్నమాట నిజమే. ఆ అమ్మాయి ఇక్కడ బి. ఏ., చదువుతూవుంది. వాళ్ళది మావూరే. ఆ అమ్మాయిని నేను

చిన్నప్పటినుంచీ ఎరుగుదును. నేనువచ్చేటప్పుడు ఆ అమ్మాయి తండ్రి తనకూతుర్ని చూచిరమ్మని మరీ మరీ చెప్పాడు. అంత కంటే యేమీ లేదు" అన్నాడు శ్యామలరావు.

"అయితే కాంతామతి చెప్పేదంతా అబద్ధమంటావా?" అని అడిగాడు బ్రహ్మానందం.

"అబద్ధమే" అన్నాడు శ్యామలరావు.

"నీమీద కల్పించి చెప్పటానికి ఆమెకేమి అవసరం వుంది ?" అని అడిగాడు బ్రహ్మానందం.

"పూర్తిగా అవసరంలేదని చెప్పటానికీ వీల్లేదు" అన్నాడు శ్యామలరావు ఆలోచిస్తూ.

తరవాత యీ విషయం మళ్ళీ బ్రహ్మానందం మరిచి పోయాడు. శ్యామలరావు అతనిగదిలోనే వుంటూవున్నా, అతని ప్రవర్తననిగురించి పితూరీలేమీ లేవు. కాంతామతి ఒకటి రెండుసార్లు తనకి కనిపించి సిగ్గుపడుతూ ఇంట్లోకి వెళ్ళిందేగాని శ్యామలరావునిగురించి యేమీ చెప్పలేదు.

ఇటువంటి వాళ్ళిద్దరూ బజార్లో కలిసి తిరుగుతూ కని పించారంటే, పైగా తనని చూసి నవ్వుకుంటూ వెళ్ళారంటే బ్రహ్మానందానికి ఆశ్చర్యం కలగటంలో ఆశ్చర్యమేముంది?

ఆ రాత్రే శ్యామలరావు నడిగాడు, 'మీ యిద్దరికీ ఎట్లా కలిసిం'దని బ్రహ్మానందం.

అతను నవ్వుతూ, "నా కోసం వస్తున్న అమ్మాయికీ నాకూ ఏమీ సంబంధంలేదని తెలిసికూడా నీతో కాంతా మతి అన్ని అబద్ధాలు చెప్పిందంటే అర్థం ఏమిటి ?" అని అడిగాడు.

"ఏమిటో నువ్వే చెప్పు" అన్నాడు బహ్మానందం.

"జెలసీ... నా మీద అభిప్రాయం తనకి వున్నదని చెప్పటం."

"ఊఁ – తరవాత?" అని అడిగాడు బ్రహ్మానందం.

"తరవాత ఇంకేముంది? నువ్వు చెప్పిన మాటను బట్టి ఆమె మనస్సు గ్రహించి ఏర్పాటు చేశాను," అన్నాడు శ్యామలరావు.

బ్రహ్మానందానికి చాలా కష్టం వేసింది. 'అయితే మీ యిద్దర్నీ సంధాన పరచటానికి నేను వుపయోగించానన్న మాట?" అన్నాడు.

శ్యామలరావు చిరునవ్వు నవ్వుతూ, "ఇతరుల కుపయోగపడే నీబోటి మహానుభావులు అప్పుడప్పుడూ పుడుతూ వుంటారు. లేకపోతే భారతదేశం ఎప్పుడో కాలగర్భంలో మునిగిపోయేది" అన్నాడు.

"చాల్లే, వూరుకో" అన్నాడు బ్రహ్మానందం.

"కాని, ఏ మాటకామాట చెప్పుకోవాలోయ్-కాంతామతి ఎంత సరసురాలనుకున్నావు!" అని పూర్తి చేశాడు శ్యామలరావు ముసి ముసి నవ్వులు నవ్వుకుంటూ.

శ్రీ [illegible] గ్రంథాలయం
[illegible]

# అమలిన శృంగారం

అగరువత్తులు, సెంట్లు, మంచిగంధం మొదలైన సువాసనద్రవ్యాలు అమ్మేషాపుల ముందునుంచి వస్తున్నాను. సువాసనద్రవ్యాలు కొనటానికి నే నక్కడికి రాలేదు. ఆ షాపులకు పైన కూరగాయల మార్కెట్టువుంది. అక్కడ ఒకఅరవీశె దోసకాయలు, ఒకతుంపుకొత్తిమేర, ఒకకట్టకరివేపాకు కొనుక్కొని యింటికి వెడుతున్నాను. నా చేతిలోవున్న దోసకాయలు మొదలైన వస్తుసంచయం చూచి అనుకుంటాను, ఆ షాపుల వాళ్ళెవరూ నన్ను లోపలికి రమ్మని పిలవలేదు.

నే నా షాపులు దాటి ఒకఅడుగు ముందుకు వేశానో లేదో ఒకఆడది నాదారి కడ్డంవచ్చింది. తప్పుకు వెడదామని ఒకపక్కకు తొలిగాను. అదికూడా అటే వచ్చింది. రెండో పక్కకి తొలిగి వెళ్ళిపోటానికి ప్రయత్నించాను. అటొచ్చి నా కెదురుగుండా నిలబడింది. ఈ ప్రకారం నాలుగైదుసార్లు జరిగిన తరువాత నాకు అనుమానం కలిగి దానిముఖం విమర్శగా చూశాను. అది చెయ్యాలనే చేస్తూవుంది. నాదారి కడ్డం రావాలనే వస్తూవుంది.

నే నా వూళ్లో ఇంతో అంతో పరువుగా బ్రతుకుతున్న వాణ్ణి. ఇటువంటి సంఘటనలు ఎరిగినవాణ్ణి కాదు. కంగారు పడి ఏదో వొకవిధంగా తప్పించుకుని వెళ్ళటానికి ప్రయత్నించాను. కాని లాభంలేక పోయింది. ఆ మనిషి ఎప్పటికప్పుడు నాదారి అడ్డగిస్తూనే వుంది.

ఇంతలో పక్కనున్న కిళ్లీకొట్టువాడు, "అయ్యోయ్యా, కదలకుండా నిలవండి?" అని కేక వేశాడు. మమ్మల్నీ, మా సత్ప్రవర్తననీ, మా కుటుంబగౌరవాన్నీ మా తండ్రులు దగ్గరనుంచీ ఎరుగును వాడు.

వాడి మాట వల్లో, కంగారు వల్లో, లేకపోతే ఏమీ తోచకో నేను కదలకుండా నుంచున్నాను. నేను నిలబడటం చూచి అది నా చొక్కా పైకెత్తి, నా పొట్టమీద తనచూపుడు వేలితో మూడుసార్లు నెమ్మదిగా పొడిచి, బొడ్డులో గుడుగుడు గుంచం పెట్టి, ఒకనిట్టూర్పు విడిచి, "అడగకుండా వున్నా బాగుండేది" అని ఎక్కెక్కి ఏడుస్తూ వెళ్ళిపోయింది.

అది వెళ్ళిపోయింది. కాని నాకు కాలూచెయ్యీ ఆడ లేదు. అలాగే నుంచున్నాను. కిళ్ళీకొట్టువాడు చిరునవ్వు నవ్వుతూ నా దగ్గరకువచ్చి, "వెళ్ళండి, అయ్యోయ్యా; ఇక అది మీ జోలికి రాదులే" అన్నాడు.

నేనుకొంచెం నిలదొక్కుకుని, "ఏమిటోయ్ వెంకన్నా, ఇట్లా చేసింది?" అని అడిగాను.

"ఖర్మ, అయ్యోయ్యా; పాపం, అదీ ఒకప్పుడు బాగా బతికిందే; రంగసాని అంటే ఈ ముప్ఫైమూడు వూళ్ళకీ ఎంత పెసిద్ధి?" అన్నాడు వెంకన్న.

"అది భోగందా ఏమిటి?" అని ఆశ్చర్యంగా అడిగాను.

"అవు నయ్యోయ్యా" అన్నాడు వెంకన్న.

"మరెందు కిట్లా తయారయింది?" అని అడిగాను.

వెంకన్న భోగం రంగసాని కథ చెప్పాడు.

భోగం రంగసాని ఆ వూళ్లోకల్లా గొప్పభోగంది. ఆ

రోజుల్లో అనేకమంది రసికులు దాని పొందుకోసం తహతహ లాడుతూ వుండేవారు. ఎంతడబ్బు కావాలన్నా గుమ్మరించి పోతూవుండేవారు. రంగసానికూడా హృదయబాధ లేకుండా చేసుకుని, డబ్బే ప్రధానంగా పెట్టుకుని వ్యాపారం సాగించింది. ఎన్నో మేడలు కట్టించింది. ఎంతో పొలం కొన్నది. ఎంతో డబ్బు సంపాదించింది.

కాని వున్నట్టుండి ఆమెలో విపరీతమైన మార్పువచ్చింది. విటుల్ని తనయింటి చాయలకి రానిచ్చేది కాదు. ఒక్కతే కూర్చుని జీవితం గడుపుతూ వుండేది. ఆమార్పు ఎల్లా వచ్చిందో, ఎందుకు వచ్చిందో ఎవరికీ తెలియదు.

ఆ రోజుల్లో రాము అనే కుర్రవాడొకడు ఆమెఇంటికి వెళ్ళి వస్తూవుండేవాడు. రాము చాలా తెలివైన, చురుకైన, అందమైన కుర్రవాడు.

అతను వెళ్లిరావటం కనిపెట్టి మొదట్లో అందరిలాగే అతనూ ఆమెవలలో చిక్కుకున్నాడనీ, బంగారంలాంటి కుర్ర వాణ్ణి భోగం రంగసాని తనపొట్టని పెట్టుకుంటూ వుందనీ వూరంతా ఆగుబ్బుగా చెప్పుకోటం మొదలు పెట్టారు.

కాని కొద్దిరోజులు గడిచేప్పటికి యథార్థంఅందరికీ తెలిసింది. రంగసాని ఆ కుర్రవాణ్ణి హృదయపూర్వకంగా ప్రేమించింది. ఏ తోటలో చూచినా, ఏ నది వొడ్డున ఎక్కడ చూచినా వాళ్ళిద్దరే కనిపిస్తూ వుండేవారు. రంగసాని తన చుట్టూ వున్న ప్రపంచాన్నే మరిచిపోయినట్టూ, ఆ కుర్రవాడే తన సర్వస్వం అయినట్టూ, ప్రవర్తిస్తూ వుండేది.

కొంతమంది వాళ్ళనిచూచి "దానిజీవితం చూడరా,

ఎంతలో ఎంతగా మారిపోయిందో? నిజంగా ప్రేమ అంటే ఏమిటో దానికిప్పుడు తెలిసివచ్చింది" అనేవారు. మరి కొంత మంది "ఇదొక టక్కు-రా; భోగందానికి, దానికి ప్రేమ ఏమిటి?" అని యీసడించేవారు.

ఎవరేమనుకున్నప్పటికీ వాళ్ళిద్దరూ ఒకర్నొకరు గాఢంగా ప్రేమించుకున్నారన్నమాట వాస్తవం. అందులో సందేహం లేదు. ఆ కుర్రవాడితో కలిసినప్పటినుంచీ రంగసానికి ప్రపంచమే కొత్తగా కనిపించింది. ప్రపంచం ఆనందమయంగా, అనుభవించినకొద్దీ ఎక్కు-వయ్యే తియ్యదనంగా కనిపించింది. తనలో వొచ్చిన మార్పుకి ఆమెకే ఆశ్చర్యం వేసింది. ఎప్పుడూ గాలిలో తేలిపోతున్నట్లు నడిచేది. మాటే ఒక తేనెవాకగా మాట్లాడేది! అర్ధనిమీలిత నేత్రాలతో తనలోని ఆనందాన్ని తానే అనుభవిస్తున్నట్లు ఉండేది. కాని ఆ కుర్రవాడు మాత్రం మొదటినుంచీ కొంచెం బెరుకు బెరుకుగా వుండేవాడు. మొదటి ఉధృతంలో రంగసాని యీ విషయం గమనించలేదు. తరువాత అనుమానం కలిగి అడిగింది.

"ఎందుకు అలావుంటావు?"

కుర్రవాడు సిగ్గుపడ్డాడు.

"చెప్పవ్ ?"

ఆమె మొహంలోకి చూడలేక తలవొంచుకుని "ఏమీ లేదు" అన్నాడు కుర్రవాడు.

'పాపం, కొత్త' అనుకొని జాలిపడింది రంగసాని.

ఆ జాలి ఆమె ప్రేమను మరీ ఎక్కు-వ చేసింది.

కాని త్వరలోనే ఆమెకు మరొక విషయం కూడా తెలిసింది. ఆ కుర్రవాడు ఎప్పుడూ తనతోనే తిరుగుతాడు. చూచినవాళ్ళు ఎవరైనా ఏమన్నా అనుకుంటారేమో అని భయం కూడా లేదు. తన దగ్గర ఎంతో అమాయికంగా పసి వాడికి మల్లే ప్రవర్తిస్తాడు. తన్ను చూడకుండా ఒక క్షణం కూడా వుండలేడు. కాని గదిలోకి రమ్మంటే మాత్రం ఉలికి పడతాడు—ఏదో వొకటి చెప్పి తప్పించుకుంటాడు.

ఈ విషయం గమనంలోకి వచ్చినప్పటినుంచీ రంగసాని మనస్సు కలవరపడటం మొదలుపెట్టింది. తను నిర్మించుకున్న ఆశాసౌధాలు కూలుతాయని భయంవేసింది. అతను తనకి కాకుండా పోతాడేమోనని దిగులు పుట్టింది. ఈ సుఖం స్వప్నానికి మల్లే తృటిలో అదృశ్యమవుతుందేమోనని బెంగ కలిగింది. అతని ప్రవర్తనకు కారణం వూహించుకోవటం మొదలు పెట్టింది. ఎన్నెన్నో ఊహాలు వచ్చేవి. ఊహించుకున్న కొద్దీ మనస్సు చెడిపోయేది. ఈ ఆరాటం భరించలేక ఒక రోజు ధైర్యం చేసి అతన్నే అడిగింది.

"గదిలోకి వెడదాం"

అతడు యధాప్రకారం కంగారు పడి బిత్తరి చూపులు చూశాడు.

"ఎందుకలా కంగారు పడతావు?"

"కంగారా ? కంగారేముంది?" అన్నాడు కుర్రవాడు.

"అయితే, రా?" అడిగింది రంగసాని.

"ఇక్కడ బాగానేవుంది."

"ఇంతకంటే అక్కడ బాగుండ కూడదూ ?"

"ఆబాగు నేను భరించలేను."

రంగసాని కర్థంకాలేదు. బాగు భరించలేకపోవటం ఏమిటి ? అతనేదో తనదదగ్గర మభ్యపెడుతున్నాడనుకుంది. తనకు అతనే లోకం. అతనికిమాత్రం అలాకాదు. తనుకాక ఇంకేదోఉంది. ఆమెకు చాలా బాధ కలిగింది. "నేనేం పాపం చేశాను ?" అని కన్నీరు పెట్టుకుంటూ బ్రతిమాలింది.

ఆమె కన్నీరు చూచేటప్పటికి ఆ కుర్రవాడు హడలిపోయాడు. "అయ్యో, అయ్యో !" అన్నాడు.

"నన్నెందు కిలా బాధ పెడతావు?"అడిగింది రంగసాని.

"నిన్ను బాధ పెడుతున్నా నా !"

"నా తప్పేమన్నా వుంటే చెప్పు."

"నా రంగా..." అని ఏదో చెప్పబోయాడు కుర్రవాడు. అతని పెదవులనుంచి తన పేరు బయటికి రావటం అదే మొదలు. అతనంత ముద్దుగా ఆమె నంతకు ముందు పిలిచి ఎరగడు. ఆ పిలుపు ఆమె శరీరాన్ని గిలిగింతలు పెట్టింది. ఆమె తన్ను తాను మరిచిపోయింది. అతని చేతుల్లో వాలింది; కౌగిలించుకుంది; ముద్దుల వర్షం కురిపించింది. ఆమె కౌగిలిలో అతను కరిగిపోయాడు. ఆమె నెమ్మదిగా అతని చెయ్యి పట్టుకుని లేచింది.

అతను ఉలికి పడ్డాడు:

"నామాట వినవుగా" అని జాలిగా అడిగింది రంగసాని.

"వింటాను"

"రా మరి?"

"అది తప్పు"

"నీకు అక్కర్లేదా అసలు ?"

"కావాలి"

"ఇంకేం మరి ?"

"అది మలినం"

"ఏది ?"

"నువ్వు కోరే శృంగారం"

"ఇంతవరకు జరిగిందో ?"

"అది అమలిన శృంగారం"

ఈ విభాగం రంగసానికి అర్థం కాలేదు. తప్పించుకోటానికి ఏదో వొక వంక చెపుతున్నాడని మళ్ళీ జాలిగా ప్రాధేయ పడింది—

"యదార్థం చెప్పు. నాకు నువ్వుతప్ప ప్రపంచం లేదు. నీవల్ల నాలో ఎంతో మార్పు వొచ్చింది. మధ్యలో నా హృదయాన్ని ముక్కలు చెయ్యకు. ఆనందాన్ని భగ్నం చెయ్యకు. ఇప్పుడు వెనక్కి చూడలేను. వెనక జీవితం అందుకోలేను. ఒక క్రొత్తలోకం చూపి, అది అనుభవంలోకి రాకముందే నన్ను వదలకు. నరకానికి నెట్టివెయ్యకు," అని పరిపరివిధాల బ్రతిమాలింది.

"నన్ను బలవంతం చెయ్యకు" అన్నాడు కుర్రవాడు.

"పోనీ కారణమన్నా చెప్పు" అన్నది రంగసాని.

"నీకు కోపం వొస్తుంది."

"నాకు నీ మీద కోపమా ? అసంభవం"

"అయితే, చెప్పనా ?"

"చెప్పు. అదే నాకు పదివేలు"

కుర్రవాడు కారణం చెప్పటానికి కొంచెంసేపు తటపటాయించాడు. చివరికి సిగ్గుపడుతూ తలవొంచుకుని చెప్పేశాడు. "నాకు భయం" అన్నాడు.

"భయం ఎందుకు?"

"ఆరోగ్యం చెడిపోతుందని"

ఏదో పెద్ద కారణం చెపుతాడనుకొన్న రంగసానికి యీ మాట వినేసరికి నవ్వు వచ్చింది. "ఆరోగ్యం చెడిపోతుందా? ఎందుకు చెడిపోతుంది? పైగా బాగుపడుతుంది" అని గుక్కలు పట్టి, నవ్వటం మొదలు పెట్టింది. ఆమె నవ్వుకి ఆ కుర్రవాడు కంగారుపడ్డాడు. ఆమెను భూతాన్ని చూసినట్టు చూశాడు. వెంటనే వెకిలినవ్వు నవ్వాడు. ఆనవ్వు చూచేటప్పటికి రంగసానికి భయం వేసింది. ఏదో జ్ఞాపకం వచ్చి నిర్జీవ ప్రతిమలా అయిపోయింది.

తెప్పరిల్లి "నేనొకటి అడుగుతాను చెప్పు" అన్నది రంగసాని.

"అడుగు" అన్నాడు కుర్రవాడు.

"ఏమీ అనుకోవు గదా?"

"అనుకోను"

అడుగుతానని అంటం అయితే అన్నదిగాని తీరా అడగాల్సి వొచ్చేటప్పటికి చాలా బాధ పడింది రంగసాని... అయినా సంశయంతో కొట్టుకున్నదానికంటే తేల్చుకోవటమే మంచిదనుకుంది.

"ఏమీ అనుకోవుగదా?" మళ్లీ అడిగింది.

"అనుకో

శ్రీ వేమన గ్రంథాలయము
తేలప్రోలు. (కృష్ణా జిల్లా)

"వొట్టు?"

"వొట్టు."

రంగసాని ధైర్యాం చేసింది.

"నీకు రోగాలు తగులుతయ్యని ..."

అంతే! అంతవరకే మాట్లాడింది రంగసాని.

ఈ మాటకి కుర్రవాడు ఉడికిపోయాడు. రంగసాని దృష్టులను భరించలేక పెడమొగం పెట్టుకున్నాడు.

"చెప్పు. చెప్పకపోతే, నన్ను చంపుకుతిన్నట్టు," అన్నది రంగసాని.

"అవును" అన్నాడు కుర్రవాడు.

ఈమాట ఆమెమీద పిడుగుపడినట్టయింది. ఆమె పాత జీవితంలోని దృశ్యాలన్నీ వికటాట్టహాసం చేస్తూ ఆమె కళ్ళముందు నృత్యంచేశాయి. ఆకుర్రవాణ్ణి భయపెట్టటానికి తన పాత జీవితమే కారణం అనుకుంది. అట్లాగేకూర్చుని పోయింది. నోటివెంట మాటలేదు.

అప్పటినుంచీ ఆ కుర్రవాడు రంగసాని యింటికి రావటం మానేశాడు.

పైగా ఆమెనుగురించి దుష్ప్రచారం చేస్తున్నాడని తెలిసింది. తను ఎప్పుడూ ఆమెను ప్రేమించలేదట. ఆమె తనను వలలో వేసుకోటానికి ప్రయత్నించిందట. తనదగ్గర డబ్బు కాజెయ్యటానికి ప్రయత్నించిందట. కాని తనా వల్లో పడేదీ? బోగంది 'నేను నిన్ను ప్రేమిస్తున్నా'నని పైకి అంటే మాత్రం తాను నమ్ముతాడా? అందుకని అనుభవించి నన్నాళ్లూ అనుభవించి వొదిలేశాడట. ఈ మాటలన్నీ రంగ

సానికి తెలిసిపైనె. ఆమె ఊహాసౌధం కూలిపోయింది. ఆమె హృదయం ముక్కలయింది.

కొన్నాళ్ళకి పిచ్చెత్తింది. అప్పటినుంచీ రంగసాని "అడగకుండా వున్నా బాగుండేది; అడగకుండావున్నా బాగుండేది" అని అనుకుంటూ బజార్లవెంట తిరగటం మొదలు పెట్టింది. తనకు నచ్చిన మగవాడు కనిపిస్తే అతన్ని ఆపి చొక్కాపైకెత్తి, పొట్టమీద తన చూపుడు వేలితో మూడు సార్లు నెమ్మదిగా పొడిచి, బొడ్డులో గుడుగుడుగుంచం పెట్టి గాని విడిచిపెట్టదు...

ఈకథవిని నేనొక నిట్టూర్పు విడిచాను. "అయితే మరి ఆ కుర్రవాడేమయ్యాడు?'' అని అడిగాను వెంకన్నని.

"అవతల పక్క వూళ్ళోవుంటున్నాడయ్యోర్. పాపం ఆయన మనసూ సరిగ్గాలేదు. ఒక మొగాడూ, ఆడదీ మాట్లాడుకోటం ఎక్కడైనా చూస్తేచాలు. అటు అతని పెళ్లానికీ, ఇటు ఆమె మొగుడుకీచెప్పి తగాదాలు పెడతా వుంటాడు. ఎప్పుడూ అదేపని అయ్యోర్"అన్నాడు వెంకన్న.

"పాపం" అని జాలిపడ్డాను నేను. నిజంగా వాళ్ళిద్దరి జీవితాలూ నా మనస్సుని చాలాకలవరపెట్టినై.

"సరేగానండీ, అయ్యోర్, అమలిన సుంగారమేం టండీ? అని అడిగాడు వెంకన్న.

"ఏమిటోలేవోయ్, ఎందుకొచ్చినగొడవ?" అన్నాను విసుగ్గా. అడుగులు బరువుగా వేసుకుంటూ, అరవీశ దోస కాయలూ, తుంపు కొత్తిమేరా, కట్టకరివేపాకూ నేనూ భద్రంగా ఇంటికి జేరాం.

# తండ్రి

తండ్రి పాపని మధ్యాహ్నం కొట్టాడు. ఎదిరింటిదివొచ్చి పాప తన కూతుర్ని కొట్టిందని చెప్పేటప్పటికి తండ్రికి కోపం వచ్చి పాపని కొట్టాడు. తరవాత పాప తప్పులేదనీ, తను అన్యాయంగా కొట్టాననీ అతనికి తెలిసింది.

ఆ రాత్రే పాపకి జ్వరం వచ్చింది.

ఆపిల్ల మంచానికి అంటుకుని మూలుగుతూ పడుకుని వుంటే అతని హృదయం తరుక్కుపోయింది. కన్నీరు కారుస్తూ పాప పక్కలో కూర్చున్నాడు.

పాప పలవరింతలు మొదలు పెట్టింది "నిజం, నాన్నా, అబద్ధంకాదు."

"అమ్మా! ఏమిటమ్మా?" అని అడిగాడు తండ్రి గద్గదస్వరంతో.

"అదే ముందు కొట్టింది, నాన్నా"

"అవునమ్మా, నాదే తప్పు."

ఎవరో కొట్టటానికి వచ్చినట్టు భయపడుతూ, "నాన్నా నాన్నా!" అంటూ ఏడ్చింది పాప.

అతని హృదయం దడదడ కొట్టుకుంది. శరీరం వొణికింది.

ఇంతలో తల్లి పాపచేతికి కాపువెయ్యటానికి వేడినీళ్లు తెచ్చింది. "కొంచెం అటు తిరుగు, అమ్మా" అన్నది.

పాపకళ్ళు తెరిచి చూచింది. "అమ్మా!"

"నేనే, అమ్మా"

"నాన్న అనుకున్నా" అని ఏడ్చింది పాప.

"ఏదీ, కొంచెం కాపు వెయ్యనీ"

వాళ్ళ సంభాషణ వింటూ అక్కడే నుంచున్నాడు తండ్రి. తన భార్యనీ పిల్లనీ కన్నెత్తి చూడటానికే సిగ్గుగావుంది.

"అమ్మా?" అన్నది పాప. జ్వర తీవ్రతకు ఆ పిల్ల మాటలు తడబడుతున్నై.

"ఏం, తల్లీ?" అన్నది తల్లి కాపువేస్తూ.

"సుందరమ్మ లేదూ?"

"ఉంది"

"నాతో ఆడుకోటానికి వొస్తుందే—?"

"అవును."

"మేము బొమ్మల పెళ్ళిళ్లు చేసుకోలా, మొన్న?"

"ఆఁ—"

"ఆ సుందరమ్మ"

"సరే" అన్నది తల్లి, కూతురు మాటలు మానిపించాలని.

"వాళ్ళ నాన్న లేదూ—?"

"ఊఁ?"

"నాకు బిళ్ళలుకొని పెడతాడే—?"

"మరే!"

"ఆయన"

"పడుకో తల్లీ"

"సుందరమ్మ నేమీ అనడు. ఏం చేసినా కొట్టడు."

తల్లి చెంగుతో కన్నీరు తుడుచుకుని శోకం దిగమ్రింగటానికి ప్రయత్నించింది.

"అమ్మా!" పిలిచింది పాప.

"ఏం అమ్మా?"

"వాళ్ళ నాన్నే ప్లీడరట"

"సరే"

"సుందరమ్మే చెప్పిందే!"

"పడుకో, అమ్మా, మాట్లాడకూడదు" అని వారించింది తల్లి.

"చూడు, అమ్మా; నా జ్వరం పోయింది."

తల్లి పిల్ల వొంటి మీద చెయ్యివేసి చూచింది. చెమటలు పడుతున్నై.

"జ్వరం నయమయాక జిలేబీ కొనుక్కుంటా"

"కొనుక్కుందువుగాని"

"మరి ఏమడిగినా డబ్బులేదంటావేం?"

"ఊరుకో, అమ్మా"

"సుందరమ్మ చూడమ్మా, ఎన్ని కొనుక్కుంటుందో? ప్లీడరుగారి కూతురు--"

తల్లి కన్నీరు తుడుచుకుంది.

"అమ్మా!"

"ఆఁ"

"రాజుగారి భార్య ఎందుకు చచ్చిపోయిందే— ?" అది ఆ పిల్ల పాఠాల పుస్తకంలోని కథ.

"........"

"అమ్మా ?"

"ఏం, తల్లీ ?"

"గొల్లపిల్లవాడు ఏమని అరిచాడే ?"—అది 'గొల్ల పిల్లవాడు, పులి, అనే కథలోని విషయం.

"చెప్పవే?"

"పులి, పులి ! అని అరిచాడమ్మా"

"మరి పులి లేదుగా ?"

"లేదు"

"ఎందుకు అరిచాడు ?"

తల్లికి వెంటనే జవాబు దొరకలేదు. ఇంతలో పక్క గదిలో పడుకున్న చంటిపిల్లవాడు ఏడిచాడు. తల్లి చీర కొంగుతో కళ్ళుతుడుచుకుంటూ పిల్లవాణ్ణి ఓదార్చటానికి వెళ్ళింది. అప్పటిదాకా కొంచెం దూరంగా నుంచుని సంభాషణ వింటున్న తండ్రి మళ్ళీ పాప పక్కలో కూర్చున్నాడు. పాప ఏదో ఆలోచిస్తున్నట్టు కనిపించింది. అతనికి భయం వేసింది.—"పాపా!" అన్నాడు.

ఆ పిల్ల ఉలిక్కి పడ్డది. బెదరి పోతున్నట్టు బిత్తరి చూపులు చూసింది. భయంతో వొణికిపోయింది: "ఒట్టేది, నాన్నా - నిజం, నాన్నా - నేను అబద్ధం ఆడను - కొట్టకు, నాన్నా" అన్నది. తాను కొట్టబోయినప్పుడు చూచిన చూపులే చూచింది. అట్లాగే భయపడింది. అట్లాగే వొణికింది.

"నాన్నా, నాన్నా, నాన్నా!"కుంచుకు కుంచుకుపోయి ఎక్కెక్కి ఏడవటం మొదలు పెట్టింది.

అతనికేమీ తోచలేదు. కన్నీరు బొటబొట కారింది.

కూతురు ఏడుపువిని, 'అంబా' అంటూ లేగ దూడదగ్గరకు పరిగెత్తుకు వచ్చే గోవుకుమల్లే వచ్చింది తల్లి. "మీరు వెళ్ళండి. మీరు కనపడితేనే భయపడుతోంది పిల్ల" అంటూ కూతురు పక్కలో కూర్చుని వోదార్చింది.

ఆ మాటకు తండ్రి చకితుడయ్యాడు. తను తనపిల్లల పాలిట యమకింకరుడు. తనగాలి సోకితేనే వాళ్లగుండె లవిసి పోతున్నాయి. నెమ్మదిగా గది బయటికి వెళ్ళాడు.

పాప మళ్ళీ శాంతించింది. మళ్ళీ తల్లికి మాటలు చెపుతూ వుంది.

"అమ్మా!"

"ఏం, తల్లీ?"

"దండించటం అంటే ఏమిటి?"—'రాజుగారికి కోపము రాగా రాణిని దండించెను' అనే వాక్యం ఆ పిల్లపాఠం లోది.

"........"

పాప మళ్ళీ అడిగింది:

"రాణి ఎవరే, అమ్మా?"

"రాజుగారి భార్య, తల్లీ"

"దండించటం అంటే?"

"కొట్టటం"— తల్లి శోకాన్ని ఆపుకోలేకపోయింది.

తల్లినుంచి 'కొట్టటం' అనేమాట వినేటప్పటికి పాప మళ్ళీ ఉలిక్కిపడి, బెదరిపోతూవున్నట్లు బిత్తరిచూపులు చూసింది. భయంతో వొణికిపోయింది. కుంచుకు కుంచుకు పోతూ, "ఒట్టేది, నాన్నా— నిజం, నాన్నా; నేను అబద్ధం

శ్రీ వేమన గ్రంథాలయము (కృష్ణా జిల్లా)

ఆడను— కొట్టకు, కొట్టకు నాన్నా, నాన్నా; నాన్నా" అంటూ ఎక్కెక్కి ఏడవటం మొదలు పెట్టింది.

తల్లిహృదయం బ్రద్దలయింది. కూతుర్ని కావిలించుకు పడుకుని బోరునపడ్చింది— "నాతల్లీ! నీకెంతకష్టం వొచ్చిందే" అని.

*

తెల్లవారి పాపకి తగ్గింది. కాని, ఆమె తనభర్తను క్షమించలేను. ఆమె హృదయంలో అతనికి స్థానంలేకుండా పోయింది.

---

# సత్యాన్వేషణ

మొదట్లో ప్రపంచాన్ని అర్థంచేసుకోడానికని 'నేను' అంటే ఏమిటో అర్థంచేసుకోటానికి ప్రయత్నించారు. దీనివల్ల బాహ్యపరిస్థితులకు అప్రాధాన్యత ఏర్పడింది. కొన్నాళ్ళకి వాటినిగురించి ఆలోచించటమే మానేశారు. పర్యవసానం, ప్రపంచాన్నిరోసి అరణ్యాలపాలవటం...

వెంటనే సత్యం తెలుసుకోటానికి మార్గం ఇదికాదు అనుకొని, బాహ్య పరిస్థితుల్ని అర్థంచేసుకోటానికి ప్రయత్నించారు. 'నేను'కి అప్రాధాన్యత ఏర్పడింది. కొన్నాళ్ళకి బాహ్యపరిస్థితుల్ని గురించి తప్ప నేనుని గురించి ఆలోచించటం మానేశారు. దీనితో మానవుడు పరిస్థితులకు బానిసగా, యంత్రంగా తయారయ్యాడు 'నేను' నీ 'బాహ్యపరిస్థితు'ల్నీ— ఈ రెంటినీ అర్థం చేసుకొని సమన్వయం చేసుకుంటే సత్యం తెలుసుకోగలుగుతాం.

# ఆత్మహత్య

"చదువుకో" అన్నది సావిత్రి.

"నా మొహానికి చదువెందుకు ?" అన్నది సావిత్రమ్మ.

"సంఘసేవచెయ్యి" అన్నది సావిత్రి.

"ఇట్లా బతికితే చాలు" అన్నది సావిత్రమ్మ.

"ఈ బతుకకంటే చావటం మేలు" అన్నది సావిత్రి.

"నిజమే. కాని అందుకూకడా ఓపిక లేదు" అన్నది సావిత్రమ్మ.

"ఎందుకని ?" అడిగింది సావిత్రి.

"తీరిక లేక!" చెప్పింది సావిత్రమ్మ.

"తీరిక చేసుకో" అన్నది సావిత్రి.

"ఎట్లా ?" అడిగింది సావిత్రమ్మ.

"ఎట్లాగో ఒకట్లా" చెప్పింది సావిత్రి.

"ఏం మానుకోమంటావు? వంటమానుకోమంటావా, పిల్లల చాకిరీ మానుకోమంటావా?..."

ఈ మాటలకు సావిత్రికి కోపంవొచ్చింది. గుడ్లెర్ర జేసింది. "పనిమనిషిని పెట్టుకో" అన్నది.

సావిత్రమ్మకి కళ్ళల్లో నీళ్ళుతిరిగినై. సావిత్రిని కావిలించుకొని ఏడవాలనుకుంది. అది అనుకోవటం- జరగటం వేరు.

"డబ్బో!" అన్నది సావిత్రమ్మ.

"మీాఆయన్ని అడుగు" చెప్పింది సావిత్రి.

"లేందే!" అన్నది సావిత్రమ్మ.

ఈ మాటకు సావిత్రికి మళ్ళీ కోపంవచ్చింది. సుఖంగా బ్రతకటంకూడా చేతకాదు సావిత్రమ్మకి. పైగా అన్నిటికీ తనే సమాధానం చెపుతూ కూర్చుంటుంది.

"డబ్బులేనివాడివి నన్నెందుకు చేసుకున్నావు? అని అడుగు మీఆయన్ని" అన్నది సావిత్రి.

"డబ్బులేదని తెలిసి నన్నెందుకు చేసుకున్నావు, అంటే?" అన్నది సావిత్రమ్మ బిక్క మొహంవేసుకొని: ఆ మొహం చూసేటప్పటికి సావిత్రి హృదయం కరిగిపోయింది. ఆమె కళ్ళు చెమ్మగిలినై.

సావిత్రి ఒక వ్యక్తీ సావిత్రమ్మ మరొక వ్యక్తీ అనుకునేరు. కాదు. సావిత్రి, సావిత్రమ్మ యౌవన దశ. సావిత్రమ్మ, సావిత్రి యొక్క సంసారదశ. ఒకరితో ఒకరు మాట్లాడుకునే అవకాశం ఎలా కలిగిందంటారా? నెమ్మది మీద అన్నీ తెలుస్తయి.

ఆరోజు ఆడపిల్లకు జడవేస్తూ కూర్చుంది సావిత్రమ్మ. దుఃఖంపొంగి పొర్లి వొస్తూవుంది. ఆమె ఆదర్శాలన్నీ భగ్నమైపోయినై. మనోరథాలన్నీ మంటిలో కలిసినై. చివరికి కూతురుకి చదువు చెప్పించుకోటానికూడా వీలవటంలేదు. మాష్టరు దొరకడు. దొరికితే తగిన డబ్బిచ్చుకోలేదు. బడి దూరం...పిల్ల ఒక్కత్తే వెళ్ళలేదు! నౌఖర్ని పెట్టుకోటానికి డబ్బులేదు. ఏం చెయ్యాలి?

చదువులేక పిల్ల చెడిపోతూవుంది. తనపిల్ల చాలా చురుకైంది: తెలివైంది. కాని ఏం లాభం?

డబ్బువుండి మంచి స్కూల్లో చదువులూ, పెద్దవాళ్లతో స్నేహాలూ చేసే అవకాశం వున్నపిల్లలు క్రమక్రమేణా వృద్ధి లోకి వొస్తుంటే, తనపిల్ల బీదవాళ్ళ పిల్లలతో తిరిగి క్రమ క్రమేణా పాడై పోతూవుంది.

ఇది సహించలేక, తనపిల్లకు తానే చదువు చెప్పుకుం దామని ప్రయత్నించింది కొన్నాళ్లు. తా నిప్పుడు సంసారంలో పడిపోయి ఇలా అయిపోయింది గాని ఒకప్పుడు బాగా చదువుకున్న మనిషే. తన తండ్రి కూచోబెట్టి కావ్యాలు చెప్పాడు.

కాని ఈ ప్రయత్నం కూడా కొనసాగలేదు. పని తెమ లకపోవటం, దానివల్ల పిల్ల ఏ పొరపాటు చదివినా చిరాకు పడటం, కొట్టటం......తలుచుకుంటే తనకే గుండె తరుక్కు పోయేది. పిల్లకు తనదగ్గరవున్న చనువూ, తన మీదవున్న ప్రేమా, నశించినై. ఒక్కొక్కప్పుడు ఆపిల్ల చూసే చూపు లకు ఆమె వొళ్లు జలదరించేది. తన్నుగురించి తన కూతురు ఏమనుకుంటూవుంది ?

మరుక్షణం నుంచీ పిల్లకు చదువు చెప్పటం మాను కుంది. బ్రతికితే తరవాత సంగతి చూచుకోవొచ్చు అనుకుంది. పిల్ల మళ్ళీ గాలికి తిరగటం మొదలు పెట్టింది.

"తనేమో తన సుఖమేమో తప్ప కూతురంటేనే లక్ష్యం లేదు. అదేమి మనిషో!" అన్నారు ఇరుగు పొరుగు వాళ్లు.

"నా సంగతి మీ కెందుకు ?" అని వాళ్ళతో పోట్లా డింది సావిత్రమ్మ. పిల్లని వొళ్లోకి తీసుకొని కన్నీరు పెట్టు

కుంది.

పిల్లని ముందు కూర్చోబెట్టుకొని తల వేళ్ళతో చిక్కు దీస్తూ ఇవన్నీ జ్ఞాపకం చేసుకుంది సావిత్రమ్మ. తన చిన్న తనం, ఆనాటి ఆదర్శాలూ, కోరికలూ అన్నీ జ్ఞాపకం వొచ్చి కళ్లు చీర చెరగుతో తుడుచుకొని గబగబా జెడ పూర్తిచేసి పిల్లని పంపింది. తనపిల్ల అంట్లుతోమే గురవమ్మ కూతురుతో ఆడుకోటానికి వెళ్తూ వుందని ఆమెకు తెలుసు.

సావిత్రమ్మకి, తటాలున, అద్దంలో తన మొహం చూచుకోవాలని బుద్ధి పుట్టింది. కాని తన మొహం అద్దంలో కనబడీ కనబట్టంతోనే, చేతులు వొణికినై. అద్దం జారి క్రింద పడి ముక్కలైంది. సరిగా సగానికి పగిలింది — రెండు ముక్కలు. ఒక ముక్కలో సావిత్రి, రెండో ముక్కలో సావిత్రమ్మ. ఇద్దరూ వేరుకాదు. సావిత్రి, సావిత్రమ్మ యౌవనదశ. సావిత్రమ్మ సావిత్రి సంసార దశ.

సావిత్రమ్మ అద్దం పగిలిందనుకోవటంలేదు. తన హృదయమే పగిలి రెండుముక్కలైంది అనుకుంది.

ఈవిధంగా సావిత్రమ్మ సావిత్రీ మాట్లాడుకోటానికి వీలు ఏర్పడింది.

"నీ చంటిపిల్లకు ఎప్పుడూ జబ్బులే. ఎందుకో తెలుసా?" అని అడిగింది సావిత్రి.

"ఎందుకు?" అడిగింది సావిత్రమ్మ.

"నీ అనారోగ్యం వల్లే!" అన్నది సావిత్రి.

సావిత్రమ్మ బిక్కమొహం పెట్టింది.

"పోనీ ఆరోగ్యం అన్నా సరిగ్గా చూసుకో"

"ఎల్లా?"

"డాక్టరుకి చూపు"

"విశ్రాంతి తీసుకోమన్నాడు"

"తీసుకో"

సావిత్రమ్మకి అప్పటి కప్పుడే మూడునెల్ల గర్భిణి. తనకు ఇంట్లో పనిచేసిపెట్టే దిక్కు లేదు. పెద్దపెద్ద డాక్టర్లకి చూపి మందులు తినే తాహాతు లేదు. ఈసంగతులన్నీ సావిత్రికి తెలుసు. ఆమె కొంచెంసేపు ఆలోచించి ఇలా అన్నది.

"సాయంకాలం కొంచెం షికారు వెళ్తూవుండు"

"చంటిదాన్ని తీసుకువెళ్లాలి" అన్నది సావిత్రమ్మ.

"తీసుకువెళ్లు" అన్నది సావిత్రి.

"గాల్లో తిప్పితే దానికి జబ్బు" అన్నది సావిత్రమ్మ.

సావిత్రి ఆలోచించింది.

"ఈ సంసారాన్ని విడిచిపెట్టు" అన్నది.

"విడిచి?" అని అడిగింది సావిత్రమ్మ.

"ఏసంఘంలోనన్నా జేరు" అన్నది సావిత్రి.

"జేరి?" అడిగింది సావిత్రమ్మ.

"సంఘసేవచెయ్యి" అన్నది సావిత్రి.

ఈసారి సావిత్రమ్మ ఆలోచించింది. కుటుంబం విడిచి పెడితే సంఘం ఏమంటుంది? పిల్లలు యేమవుతారు? తన భర్తో? ఇప్పుడు తను సంఘానికి ఏంచెయ్యగలుగుతుంది? మళ్ళీ గర్భిణిగదా! మొగుణ్ణివిడిచి వెళ్ళిందంటారు అంతా. తన భర్త ఎంతబాధపడతాడో! పాపం ఆయన తప్పేముంది? ఆయనా తనకిమల్లేనే బాధపడుతున్నాడు. ఆయనకీ తనకిమల్లేనే జీవి

తంలో లంగరు అందటంలేదు.

సావిత్రమ్మ ఈ ఆలోచనలన్నీ సావిత్రి గ్రహించింది. ఆమెకు కోపంవొచ్చింది.

"నువ్వు పిరికిదానివి" అన్నది సావిత్రి.

"అవును" అని నిట్టూర్చింది సావిత్రమ్మ.

"ధైర్యం తెచ్చుకో" అన్నది సావిత్రి.

"ఓపికలేదు" అన్నది సావిత్రమ్మ.

ఈమాటకు తన కంఠం ఎవ్వరో నులుముతున్నట్టు బాధపడింది సావిత్రి. కళ్లు చింతనిప్పులైనై.

"నీకర్మ, అనుభవించు. ఇలాగే కుళ్ళికుళ్ళి చావు" అన్నది.

ఈమాటకు తోకతొక్కిన పామల్లే లేచింది సావిత్రమ్మ. ఒకక్షణం సావిత్రికీ సావిత్రమ్మకీ భేదంలేకుండా పోయింది. కాని మరుక్షణం సావిత్రమ్మ సావిత్రమ్మగారయి కూర్చుంది. సావిత్రినిచూస్తే అసూయ కలిగింది. కంపరం పుట్టింది. నున్నగా దువ్వుకున్న సావిత్రిజుట్టు పీకాలనీ, యౌవనంతో నవనవలాడే సావిత్రిచెక్కిళ్లు రక్కాలనీ లేచింది.

సావిత్రిని ప్రతిఫలిస్తున్న అద్దంముక్క చేత్తోపట్టుకుంది.

వెంటనే సావిత్రి మాయం అయి సావిత్రమ్మలో కలిసింది. ఆ భారంమొయ్యలేక సావిత్రమ్మ తల ముగ్గుబుట్ట అయింది.

ఇప్పుడో
సావిత్రమ్మకి
అరవైఏళ్ళు.

---

# సరే, కానివ్వండి

అత్తమామలు గుడిసెమధ్యన కూర్చుని ఏమో గుస గుస లాడుకుంటున్నారు. అత్తపేరు వెంకమ్మ; మామపేరు వెంకయ్య. వాళ్ళ పెళ్ళినాడు—"పేర్లు బలేబాగా కుదిరినై" అనుకున్నారు అంతా.

వాళ్ళ కోడలిపేరు సిద్దమ్మ; కొడుకుపేరు సీనప్ప. సీనప్ప ఆరునెలల కిందట ఇల్లువిడిచి పరారయ్యాడు. ఇంత వరకు పత్తాలేదు. ఆరునెలల్నించీ పోలీసులు వెతుకుతానే వున్నారు సీనప్పకోసం.

సీనప్ప పరారి అవటానికి కారణం: ఆ వూరు కరు వొచ్చింది. వర్షంమీద ఆధారపడ్డ సేద్యం. ఆ సంవత్సరం వర్షాల్లేక వేసినపైరు వేసినట్టుగా మాడిపోయింది.

సీనప్పతండ్రి చాలాకాలంనుంచీ మణేదారు రామయ్య గారి పొలం అయిదు ఎకరాలు కౌలుకి తీసుకొని చేస్తూండే వాడు. భుక్తికి లోటులేకుండా జరుగుతుండేది. ఎప్పుడూ బకాయిపడి ఎరగడు.

ఈ సంవత్సరం ఒక్క గింజకూడా పండలేదు. బాకీ, వొచ్చేపంటలో తీర్చుకుంటా నన్నాడు, వెంకయ్య. మణేదారు రామయ్య వొప్పుకోలేదు. వెంకయ్యకున్న ఎడ్ల జతనీ, ఆవునీ దూడనీ గేదెనీ, మరికొంత సామానూ జప్తుకితెచ్చి బాకీక్రింద జమకట్టుకున్నాడు మణేదారు రామయ్య.

చేతులోవున్న పొలం పోయేటప్పటికి ముసలివాడు

మంచం ఎక్కాడు. సీనప్ప కూలికోసం తిరిగాడు.

పంటలు పండకపోతే కూలి ఎక్కడ దొరుకుతుంది?

క్రమేణా కరువు చుట్టుపక్కల గ్రామాలన్నీ వ్యాపించింది. ఒకరోజు అనుకోకుండా వూళ్లోవున్న బీదజనం అంతా మణేదారు రామయ్య ఇల్లు చుట్టుముట్టారు. అందులో సీనప్ప కూడా వున్నాడు.

"ఏం కథ?" అన్నాడు మణేదారు రామయ్య.

"ఏముందీ?" అన్నాడు సీనప్ప.

"ఏం లేకేం?" అన్నాడు మణేదారు రామయ్య.

"ఉండబట్టే వొచ్చాం" అన్నాడు సీనప్ప.

"అయితే ఏమిటో చెప్పూ?" అన్నాడు మణేదారు రామయ్య.

"చెప్పటానికేగా వొచ్చిందీ!" అన్నాడు సీనప్ప. అతనికి ఏం చెప్పాలో తోచలేదు.

ఇంతలో "అన్నం కావాలి" అని కేకవేశాడు ఒకడు జనంలో నుంచి.

"నా దగ్గర ఎక్కడుందీ ?" అన్నాడు మణేదారు రామయ్య.

"మరి నీ తాతదగ్గరవుందా?" అన్నాడు సీనప్ప.

"మాటలు జాగ్రత్తగా రానియ్" అన్నాడు మణేదారు రామయ్య.

"పురులు కోయిస్తావా?" అన్నాడు సీనప్ప.

సీనప్ప నోటినుంచి 'పురులు' అనేమాట బయటపడగానే జనం పురులమీదకు ఎగబడ్డది. ఎక్కడనుంచి

వచ్చారో పోలీసులు! టపటప టపటప తుపాకులు పేల్చారు: ఆరోజు ఆరుగురు మరణించారు. అప్పటినుంచీ మణేదారు రామయ్యమీద సీనప్పకు అమితకోపంగా వుంది. దానికి తగ్గట్టు రెండోరోజు మరొకటి జరిగింది: సిద్దమ్మకి దారే పోతూ కనబడి కావాలంటే డబ్బిస్తా రమ్మని ఇంటికి తీసుకు వెళ్ళాడట మణేదారు రామయ్య. తీసుకువెళ్ళి ఏమిటేమిటోగా చూశాడట. సిద్దమ్మ ఏడుస్తూవచ్చి సీనప్పకి చెప్పింది. సీనప్ప వెళ్ళి మణేదారు రామయ్యని అడిగాడు:

"ఏం కథ? అన్నాడు సీనప్ప.

"ఏముందీ?" అన్నాడు మణేదారు రామయ్య.

"ఏం లేకేం?" అన్నాడు సీనప్ప.

"ఉంటే చెప్పూ" అన్నాడు మణేదారు రామయ్య.

"నూకల్ని పెడతా మేకల్ని కాస్తా?" అన్నాడు సీనప్ప.

"ఆఁ" అన్నాడు మణేదారు రామయ్య.

"పెద్దపులి వొస్తే జడవకుండా వుంటా?" అన్నాడు సీనప్ప.

"ఆఁ"అన్నాడు మణేదారు రామయ్య.

కర్రతో తలమీద ఒక్కవేటువేసి "జడిశావేం?" అన్నాడు సీనప్ప.

దెబ్బకి మణేదారు రామయ్య క్రిందపడి పొయ్యాడు. చిల్లిపడి నెత్తురు కారింది. ఆనెత్తురు చూసేటప్పటికి సీనప్పకి పోలీసులు జ్ఞాపకంవొచ్చారు: కొండల్లోకి పారిపోయాడు.

అప్పటికి సిద్ధమ్మకి ఏడోనెల. సీనప్పకి జరిగింది మరిది ద్వారా విని అకాలంగా ప్రసవించింది.

సీనప్ప వెళ్ళినదగ్గరనుంచీ కుంటుంబంపని మరీ అన్యాయం అయింది. మాటిమాటికీ పోలీసుజులుం. ఊళ్లో డబ్బున్న వాళ్ళెవ్వరూ "రామ రామ" అనరు. మణేదారు రామయ్య పగపట్టాడు. ఈ విషయమే గుడిసెమధ్య కూర్చొని సిద్దమ్మ అత్తమామలు గుసగుస లాడేది.

"వాడు మనకి పుట్టలేదనుకో," అన్నాడు వెంకయ్య.

"అనుకుంటే అవుద్ది?" అన్నది వెంకమ్మ.

"అవ కొట్టడుతుందా?"

"కొట్టాలీ?" అన్నది వెంకమ్మ.

"మరి ఎందుకు ఏడవాలీ ?"

"కన్నకడుపుగా మరి," అన్నది వెంకమ్మ.

"దాని సిగ తరిగిరి" అన్నాడు వెంకయ్య

"దేని సిగా?" అన్నది వెంకమ్మ.

"దాని సిగే!" అన్నాడు వెంకయ్య.

"నోటితో చెప్పరాదూ ?" అన్నది వెంకమ్మ.

"కన్నకడుపు సిగ" అన్నాడు వెంకయ్య.

"రామయ్య తండ్రీ !" అన్నది వెంకమ్మ.

"ఓరి మణేదారు రామయ్యా !" అన్నాడు వెంకయ్య.

"వెళ్ళినవాడు రాడేం ?" అన్నది వెంకమ్మ.

"ఎందుకు వొస్తాడే. పిచ్చిదానా?" అన్నాడు వెంకయ్య

"ఏం ? అన్నది వెంకమ్మ.

"వొస్తే కూడెట్టొద్దూ ?"

ఈ గుసగుసలు వింటున్న సిద్దమ్మకి కోపం వొచ్చింది. నాలుగు రోజులనుంచి ఇంట్లో బియ్యంలేవు. తాను స్మశానా

నికి వెళ్ళి యింత ఉత్తరేణి ఆకు కోసుకొచ్చి వొండింది. ఏమీ తినకపోతే పిల్లవాడికి పాలు వుండవని భయం. అంతకు ముందు దాకా కదలకుండా కూర్చున్న అత్తమామలు ఆకు పొయ్యి మీంద నుంచి దింపేటప్పటికి నాకు పెట్టమంటే నాకు పెట్టమని పోట్లాడారు. ఇప్పుడు సీనప్పని ఆడిపోసుకుంటున్నారు.

"అయిందా ?" అన్నది సిద్దమ్మ కోపంగా.

"అవ కేం ?" అన్నాడు వెంకయ్య.

"బియ్యాం పట్టకురా" అన్నది సిద్దమ్మ.

"ఎక్కడ ?"—అడిగాడు వెంకయ్య.

"వల్లకాట్లో" అన్నది వెంకమ్మ.

"గవర్నమెంటువాళ్ళు ఇస్తున్నారంట" అన్నది సిద్దమ్మ

"పొద్దున్న వెళ్తిమే !" అన్నాడు వెంకయ్య.

"తీసుకురాలేదేం మరి ?" అన్నది సిద్దమ్మ.

"బియ్యం ఇచ్చేది—" నసుకుతున్నాడు వెంకయ్య.

"మణేదారు రామయ్యే !" చెప్పేసింది వెంకమ్మ.

ఈమాట వినేటప్పటికి సిద్దమ్మకి అత్తమామల మీద కోపం వొచ్చింది. తిండి దొరకపోటానికి తనే కారణం అయినట్టు మాట్లాడతారు. మణేదారు రామయ్యని తన మొగుడు కొట్టబట్టే కరువు వొచ్చినట్టు నటిస్తారు. "ఏదో వొకటి తీసుకురండి" అన్నది సిద్దమ్మ.

"ఏమిటే వెంకమ్మా ?" అన్నాడు వెంకయ్య.

"ఏమిటో—" అన్నది వెంకమ్మ.

"వెళ్ళరేం ?" అని గద్దించింది సిద్దమ్మ.

"మణేద్దారు—" అని మొదలుపెట్టాడు వెంకయ్య.

అప్పుడు ఆమెకు తట్టింది—"గంజేరాకు తీసుకురండి" అన్నది సిద్దమ్మ.

అత్తమామలకు ఆమెను చూస్తే భయం వేసింది.

"పద, ముసలాడా" అన్నది వెంకమ్మ.

"పదవే, భామా" అన్నాడు వెంకయ్య.

వాళ్ళు వెళ్ళగానే పిల్లవాణ్ణి చేతుల్లో పెట్టుకుని కొండల మీదకు పరుగెత్తింది సిద్దమ్మ.

౨

ఆరు నెలలనుంచీ సీనప్పకోసం వెతికి చూస్తూనే వుంది సిద్దమ్మ. కొడుకు పుట్టాడని కూడా తెలియదు తన మొగుడుకి. తెలిస్తే ఎంత సంతోషిస్తాడు! పైగా వూళ్ళో అంతా "అచ్చగా సీనప్పే" అన్నారు.

సీనప్ప ఎప్పటికైనా కొడుకుని చూసుకోటానికి తప్పకుండా వొస్తాడని సిద్దమ్మ నమ్మకం: అప్పటికి పిల్లవాడు చిక్కిపోకుండా బాగ్గా వుండేటట్టు చూచుకోవాలి. మణేదారు రామయ్య ఆవునూ, గేదెనూ తోలుకువెళ్ళాడు. ఇక తన పాలే పిల్లవానికి ఆధారం. అత్తమామలకు పెట్టకుండా అయినా సరే తన కడుపు నింపుకుంటూ వుండేది సిద్దమ్మ. ఇరవై రోజుల క్రిందట సీనప్ప ఆదవాని లంకలో ఎవరికో కనిపించాడని తెలిసింది సిద్దమ్మకి. వెంటనే తెలుసుకురమ్మని మరిదిని పంపింది. అప్పటినుంచీ రోజూ కొండమీదికి ఎక్కి మరిదికోసం ఎదురుచూస్తూ వుంటుంది. ఇవ్వాళ కొండ ఎక్కే-

టప్పటికి మరిది కనిపించాడు. "కనపడ్డాడా ?"—అడిగింది సిద్దమ్మ.

"నే నెవర్ని ?"—అడిగాడు మరిది.

"సీనప్ప తమ్ముడివి" అన్నది సిద్దమ్మ.

"కనపడ్డాడు" అన్నాడు మరిది.

సిద్దమ్మకి ప్రాణం లేచివొచ్చింది. ఎప్పుడో చిన్నప్పుడు గొడ్లకాడ బుడ్డాళ్ళు పాడుకుంటే వినేది. ఆపాట ఇప్పుడు జ్ఞాపకం వొచ్చింది.

'గుఱ్ఱాలా గోపిరెడ్డీ
నీపేరే బంగార్ప కడ్డీ!'

"బుల్లోడిసంగతి చెప్పావా?" అన్నది సిద్దమ్మ.

"చెప్పేదాకానా ?" అన్నాడు మరిది.

"ఏం ?" అడిగింది సిద్దమ్మ.

"తనే అడిగాడు" అన్నాడు మరిది.

"ఏమన్నా డేంటీ ?" అడిగింది సిద్దమ్మ.

"చెప్పేతలికి గంతేశాడు—"

"ఓ లబ్బో !" అన్నది సిద్దమ్మ.

"—ఎగిరి" అని పూర్తిచేశాడు మరిది.

"సరి" అన్నది సిద్దమ్మ.

మరిది మూలుగుతూ కూర్చోబడ్డాడు. అప్పుడు చూచింది సిద్దమ్మ: నడిచి నడిచి అతనికాళ్ళు బొబ్బలెక్కి వున్నై. పిల్లవాణ్ణి రాళ్ళమీద పడుకోబెట్టి మరిదికాళ్ళు పిసుకుతున్నది సిద్దమ్మ. "నేను బయలుదేరి ఎన్నాళ్ళయింది?" అడిగాడు మరిది.

"ఇరవై రోజులు" చెప్పింది సిద్దమ్మ.

"సరి" అన్నాడు మరిది.

"ఎట్లా వున్నాడు?" అడిగింది సిద్దమ్మ.

"చలిమంట లాగా" అన్నాడు మరిది: "దేశాన్ని తిరగ వేస్తాడంట."

"ముద నష్టపాడు!" అంది సిద్దమ్మ మురిపెంగా

"ఎటు పడితే అటే" అన్నాడు మరిది.

"సరి" అన్నది సిద్దమ్మ.

సిద్దమ్మ ఇంకొక విషయం అడగాలను కుంది. కాళ్ళు పిసకటం ఆపి మరిదిని తేరిపార చూసింది సిద్దమ్మ. తేరుకొని లేచాడు మరిది. బుల్లోడు మరిదినిచూసి బోసినవ్వు నవ్వాడు. అకస్మాత్తుగా 'తా' అని జ్ఞాపకం వొచ్చింది మరిదికి: "వొస్తా నన్నాడు" అన్నాడు.

"ఎప్పుడు?" అడిగింది సిద్దమ్మ.

"ఆదివారం" అన్నాడు మరిది.

"ఇవాళే!" అడిగింది సిద్దమ్మ

"మాంపిటికి" అన్నాడు మరిది.

సిద్దమ్మకి చిన్నప్పుడు విన్న తోలుబొమ్మలపాట జ్ఞాపకం వొచ్చింది: ఎప్పుడూ సీనప్ప పాడుతుండేవాడు.

'రాత్రి పన్నెండు గంటలకీ
రాను తిరిగి నేను వొస్తే
రాను పొమ్మంటివే
రమణి ముద్దుల గుమ్మ!
గుమ్మా! బలే గుమ్మా! అరే గుమ్మా!'

"ముద నష్టపాడు!" అన్నది మురిపెంగా.

"ఎటు తిరిగితే అటే" అన్నాడు మరిది.

"సరి" అన్నది సిద్దమ్మ.

## 3

మరిదీ, సిద్దమ్మా, ఇంటికి వొచ్చేతలికి వెంకమ్మా వెంకయ్యా ఒకమూల వొదిగి కూర్చొని ఏదో నముల్తున్నారు.

వీళ్ళని చూచి తాటించటం ఆపేసి పట్టుబడ్డ దొంగలకు మల్లే గుక్కు మిటకరించారు.

"ఏమిటది?" అన్నది సిద్దమ్మ.

"నీళ్ళు—" అన్నాడు వెంకయ్య.

"ఏం చేస్తున్నారు?" అన్నది సిద్దమ్మ.

"నముల్తున్నాం" అన్నది వెంకమ్మ.

వెంకమ్మ వొళ్లోవున్న మూట సిద్దమ్మ చూచింది: లాకుకుంది: బియ్యం ...

"ఎక్కడివి?" అడిగింది సిద్దమ్మ.

"తెమ్మంటివే ?"అన్నాడు వెంకయ్య.

"తెచ్చాం" అన్నది వెంకమ్మ.

"ఎవరిచ్చారు ?" అడిగింది సిద్దమ్మ.

"గంజేరాకు—" అన్నాడు వెంకయ్య.

"కాదు, కాదు. మణేదారు" అన్నది వెంకమ్మ. సిద్దమ్మ బియ్యంమూట చేత్తోపట్టుకొని కొంచెంసేపు ఆలోచించింది.

"మణేదారు తలకాయ" అన్నది సిద్దమ్మ.

"మానోట్లో కరక్కాయ" అన్నది వెంకమ్మ.

"కరిమింగిన వెలక్కాయ" అన్నాడు వెంకయ్య. సిద్దమ్మ బయటికివెళ్ళి కాకిగూడు పొడుచుకువచ్చి, పొయ్యి రాజేసి, బియ్యం పొయ్యిమీద పెట్టింది.

అన్నం వుడుకుతూవుంది. మరిది సోషవచ్చి కుక్క మంచంలో పడుకున్నాడు. అత్తమామలు గుటకలుమింగుతూ కూర్చున్నారు.

పోలీసువొచ్చాడు: "ఏం, కూచ్చున్నారేం?" అన్నాడు.

అత్తా మామలు నుంచున్నారు. సిద్దమ్మ తమకు అన్నం పెడతుందో లేదో అని చిరాగ్గావున్న వెంకయ్యకి పోలీసువాణ్ణి చూసేతలికి కోపం వచ్చింది: పొయ్యిమీద వుడుకుతున్న కుండ బ్రద్దలుకొట్టి నోటిదగ్గరఅన్నం కాకులకీ, కుక్కలకీ వేసేరకం.

"ఏం కథ?" అన్నాడు పోలీసు.

"కంచికి వెళ్ళింది" అన్నాడు వెంకయ్య.

"ఎక్కడ నీ కొడుకు?" అడిగాడు పోలీసు.

"రంగం వెళ్ళాడే—" అన్నాడు వెంకయ్య.

"నాయుడుబావా" అన్నది వెంకమ్మ.

పోలీసుకి ఏమీతోచక తుపాకి మడమతో వెంకయ్యని పొడిచాడు.

"అబ్బ!" అన్నాడు వెంకయ్య.

"మ రేమనుకున్నావు?" అన్నాడు పోలీసు.

"గాడిద గుడ్డనుకున్నారా తండ్రీ" అన్నాడు వెంకయ్య. పోలీసు వంటింట్లోకి వెళ్ళాడు. పొయ్యిమీద అన్నంవుడుకుతూ

వుంది. పొయ్యి దగ్గర సిద్దమ్మ కూర్చొనివుంది. అన్నంమీద వున్నఆశకొద్దీ వెంకయ్య పోలీసువెంట వెళ్ళాడు. పోలీసుని చూసేటప్పటికి సిద్దమ్మ కంగారుపడింది. మాపటికే సీనప్ప వచ్చేది! పసికడతాడేమో...

"ఛీ ఛీ కుక్కేదీ?" అని కుక్కని అదిలించింది సిద్దమ్మ. కుక్కలేదు. "అన్నం వొండుతున్నావే!" అన్నాడు పోలీసు.

"కొద్దిగా బియ్యం..." అన్నది సిద్దమ్మ.

"ఎక్కడివి?" అన్నాడు పోలీసు; "దొంగిలించావా?"

ఇక తరవాత పొయ్యిమీద కుండ పగలగొట్టటమే అని గ్రహించాడు వెంకయ్య.

"ఏయ్, పోలీసూ?" అన్నాడు వెంకయ్య.

"ఏం?" అన్నాడు పోలీసు.

"బియ్యాం ఎక్కడివో తెలుసా?" అడిగాడు వెంకయ్య.

"ఎక్కడివి?" అడిగాడు పోలీసు.

"గంజేరు---" అన్నాడు వెంకయ్య.

"కాదు, కాదు. మణేదారు" అంది వెంకమ్మ; అప్పుడే వొచ్చింది.

మణేదారు పేరు వినేటప్పటికి పోలీసు కుండజోలికి వెళ్ళటం మానేశాడు. సిద్దమ్మనిచూచి అర్థయుతంగానవ్వాడు. సిద్దమ్మకి సిగ్గువేసింది. అదీ మంచిదే అయింది.

"వెళ్తున్నా, సిద్దమ్మా" అన్నాడు పోలీసు.

వెడుతూ, వెడుతూ తుపాకి మడమతో వెంకయ్యని ఒకపోటు పొడిచివెళ్ళాడు.

"నన్ను పొడవలేదే!" అన్నది వెంకమ్మ.

"నేను ఊరుకోనని భయం" అన్నాడు వెంకయ్య.

సిద్దమ్మ మరిదికి వేన్నీళ్ళు తోడి, వీపు తనే తోమి అన్నం వొడ్డించింది. మరిది సేద తేరి అన్నానికి కూర్చున్నాడు.

"ముసలోళ్ళకి చెప్పావ్‌ను" అన్నది సిద్దమ్మ.

"ఏమని ?" అడిగాడు మరిది.

"అతగా డొస్తాడని" అన్నది సిద్దమ్మ.

"చెపితే ?" అన్నాడు మరిది.

"గోల చేస్తారు" అన్నది సిద్దమ్మ. "పోలీసు వాళ్ళకి తెలుస్తుంది."

"సరి, సరి" అన్నాడు మరిది.

సిద్దమ్మ మరిది అన్నం తింటున్నంతసేపూ అత్త మామలు గుటకలు మింగుతూ కూర్చున్నారు: తమకేమీ మిగల నివ్వడేమోనని భయం.

"సిద్దమ్మా !" అన్నాడు వెంకయ్య.

"ఏం ?" అన్నది సిద్దమ్మ.

"అహఁ, ఏం లేదు" అన్నాడు వెంకయ్య.

మరిది అన్నం తిన్నతర్వాత అతన్ని పడుకోబెట్టి పిల్ల వాడికి పాలిస్తూ కూర్చుంది సిద్దమ్మ. "నీబాబు వొస్తాడ్రా" అంది సిద్దమ్మ

"ఉంజ్ఞ... ఉంజ్ఞ" అన్నాడు పిల్లవాడు.

"మా బాబుకి అన్నీ తెలుసు" అని ముద్దు పెట్టు కుంది సిద్దమ్మ.

పిల్లవాణ్ణి పడుకోబెట్టి సిద్దమ్మ వంటయింట్లోకివచ్చి చూసేతలికి అత్తమామలు కుండలోని అన్నం బొక్కుతూ

వున్నారు. వాళ్ళనిచూచి గుక్కలుపట్టి నవ్వింది సిద్దమ్మ. తిట్టిపోస్తుందనుకున్న అత్తమామలు ఆమె నవ్వుచూచి బిత్తరపోయారు. ఆమెకు వొక్క మెతుకుకూడా విడిచిపెట్టకుండా తిన్నందుకు వెంకయ్య కళ్ళల్లో నీళ్లు తిరిగినై.

"తిట్టవే, సిద్దమ్మా" అడిగాడు వెంకయ్య.

"ఇవాళ తిట్టను" అన్నది సిద్దమ్మ.

"ఎందుకనీ?" అడిగాడు వెంకయ్య.

"చెప్పనే చెప్పను" అన్నది సిద్దమ్మ.

"చెప్పనన్నా చెప్పు, తిట్టనన్నా తిట్టు" అన్నాడు వెంకయ్య.

"తిడితే నీ నోటి ముత్యాలు రాలిపోవులేవే" అన్నది వెంకమ్మ.

సిద్దమ్మ డొక్కలు చెక్కలయ్యేట్టు నవ్వింది.

"వెంకమ్మా—?" అన్నాడు వెంకయ్య.

"ఏంది ముసలాయనా?" అన్నది వెంకమ్మ.

"మన పెళ్ళిఅయి ఎన్నేళ్ళయిందీ అంట?" అన్నాడు వెంకయ్య.

"నలభై ఏళ్ళవలా?" అన్నది వెంకమ్మ.

"ఎప్పుడైనా ఇటువంటి విడ్డూరం చూశావూ?" అడిగాడు వెంకయ్య.

"చూడలేదు" అన్నది వెంకమ్మ.

"చూస్తే చెప్పవే?" అడిగాడు వెంకయ్య.

"చూడలేదు భగవంతుడా, చూడలేదు" అన్నది వెంకమ్మ.

౪

చీకటి పడింది. సాయంకాలం వుతుక్కున్న చీర కట్టుకుని పిల్లవాణ్ణి పడుకోబెట్టి, సీనప్పకోసం ఎదురు చూస్తూ వుంది సిద్దమ్మ. అత్తమామలు నిద్రపోతున్నారు. మరిది కాళ్లు లాగుతున్నాయని మూలుగుతూ పడుకున్నాడు. పడుకోబోయే ముందు "అన్నయ్య రాగానే లేపు వొదినా" అన్నాడు. సిద్దమ్మ నవ్వింది.

"నవ్వుతావేం ?" అన్నాడు మరిది.

"పడుకో" అన్నది సిద్దమ్మ.

"సరే, నీ యిష్టం" అన్నాడు మరిది. కాని, పడుకోటానికి బదులు మూలుగుతున్నాడు.

"ఓ వొదినా !" అన్నాడు మరిది.

"ఏం మరిదీ ?" అన్నది సిద్దమ్మ.

"అన్నయ్యతో ఎంతమంది కుర్రాళ్ళున్నా రనుకున్నావు ?" అన్నాడు మరిది.

"ఎవళ్ళు ?" అన్నది సిద్దమ్మ.

"ఎవళ్ళో !" అన్నాడు మరిది; "అంతా కలిసి దేశాన్ని తిరగతవ్వుతారంట. కరువులు రాకుండా చేస్తారంట"

"ముదనష్టపాడు !" అన్నది సిద్దమ్మ మురిపెంగా.

"అయితే పడుకోనా ?" అన్నాడు మరిది.

మరిదికి నిద్రపట్టింది. కిటికీలోనుంచి బయటకు చూస్తూ నిలబడింది సిద్దమ్మ. దూరాన వున్న కొండలు కనిపిస్తున్నై. కొంచెంసేపటికి బయట కుక్క 'బొంయి' మన్నది. గబగబా

వెళ్ళి తలుపు తీసింది సిద్దమ్మ. పోలీసువాడు గస్తీతిరుగు తున్నాడు. సిద్దమ్మకి వొళ్ళు జలదరించింది. సీనప్ప పట్టు పడతాడేమో అని భయంవేసింది. ఎలాగైనా పోలీసువాణ్ణి పంపించి వెయ్యాలి.

"ఏమే, చెల్లప్పా?" అన్నది సిద్దమ్మ. పోలీసు పేరు చెల్లప్ప.

"ఓహో, సిద్దమ్మా!" అన్నాడు చెల్లప్ప.

"ఎక్కడా కనపట్టంలేదే?" అన్నది సిద్దమ్మ.

"కరువొకటివొచ్చిందా: రాత్రింబగళ్ళు పనే" అన్నాడు చెల్లప్ప.

"పాపం?" అన్నది సిద్దమ్మ.

"ఏం?" అన్నాడు చెల్లప్ప: "డ్యూటీ అన్నాక డ్యూటీయే... ..."

"ఏందే అదీ?" అడిగింది సిద్దమ్మ.

"ఏదీ?" అడిగాడు చెల్లప్ప.

"ఇప్పుడు నువ్వన్నమాట?"

"నేనేమన్నా నే-—" మురిపెంగా ఏదన్నా మాట అందా మనుకున్నాడు. 'ముద్దులగుమ్మా!' బాగుండలేదు. 'చిలకల కొలికీ!' బాగుండలేదు. ఏమీతోచక "సిద్దీ!" అని వూరు కున్నాడు. సిద్దమ్మ సరసకు వెళ్ళాడు చెల్లప్ప.

"ఓ లన్నా!" అన్నది సిద్దమ్మ.

"అదేం మాట?" అన్నాడు చెల్లప్ప.

"వాడనె బాగుందా?" అడిగింది సిద్దమ్మ.

"ఇప్పుడు దాని సంగతి ఎందుకు, సిద్దీ" అన్నాడు

చెల్లప్ప. చెల్లప్పకి మూడో పెళ్లి——భార్యమీద అనుమానం.

"కాదు అన్నా, రాత్రిళ్లు నువ్విట్లా తిరుగుతూవుంటే-" అన్నది సిద్దమ్మ.

"ఛుఫ్" అన్నాడు చెల్లప్ప.

"కాదే. మరి రామయ్యగారి కిట్టప్ప అనేవాడు వొక డున్నాడా..." అన్నది సిద్దమ్మ.

"ఛుఫ్ ఛుఫ్" అన్నాడు చెల్లప్ప.

"నీకు తెలియదు కామాలు: ఇవ్వాళే వొచ్చాడు వూళ్ళోకి" అన్నది సిద్దమ్మ.

"ఛుఫ్ ఛుఫ్ ఛుఫ్ ఛుఫ్" అన్నాడు చెల్లప్ప.

ఇక చాలు అనుకుంది సిద్దమ్మ. పొదచాటున నక్కి చెల్లప్ప చర్యలు గమనిస్తూ వుంది. చెల్లప్ప కొంచెంసేపు అటూ ఇటూ తిరిగాడు. చెల్లప్పకి చాలాకాలంనుంచీ రామయ్యగారి కిట్టప్పమీద అనుమానంవుంది; ఆగలేక ఇంటికి వెళ్ళాడు.

సిద్దమ్మ సంతోషంగా ఇంట్లోకి వెళ్లింది.

"ఓ వొదినా?" అన్నాడు మరిది.

"ఛుఫ్" అన్నది సిద్దమ్మ.

"ఎక్కడికి కెళ్ళావు?" అన్నాడు మరిది.

"ఛుఫ్ ఛుఫ్" అన్నది సిద్దమ్మ.

"అదేమిటి వొదినా!" అన్నాడు మరిది.

"ఛుఫ్ ఛుఫ్ ఛుఫ్ ఛుఫ్!" అన్నది సిద్దమ్మ.

౨౩

సిద్దమ్మ సీనప్పకోసం కనిపెట్టుకుని కూర్చుంది. గడి మళ్ళీ మళ్ళీ శుభ్రం చేసింది. అతను వొస్తే ఏం చెయ్యాలో తోచదు. ఎలా వుంటాడో! ఏం చేస్తాడో! ఏమంటాడో! అలికిడైతే చాలు గుండెదడదడ కొట్టుకొనేది; వొళ్లు వశంతప్పిమూర్ఛవచ్చినట్టయ్యేది. "సీనప్పా!" అనుకుంది సిద్దమ్మ. సీనప్ప వొస్తున్నాడేమో అని రెండు మూడుసార్లు బయటకువెళ్లి చూచివొచ్చింది. ఒకసారి చీకట్లో రంయిన కొండలదాకా వెళ్ళింది. సీనప్ప కనపడలేదు. వెంటనే, మరొక దారిని ఇంటికి వొచ్చాడేమో అనుకుని వెనక్కి పరుగెత్తు కొని వొచ్చింది సిద్దమ్మ.

సిద్దమ్మ ఇంటికి వొచ్చేటప్పటికి సీనప్ప రాలేదు. పిల్ల వాడుమాత్రం లేచి గుక్కలుపట్టి ఏడుస్తున్నాడు. సిద్దమ్మ పిల్ల వాడికి పాలిచ్చి పడుకోబెట్టింది.

లేచి వొచ్చి మరిదిని లేపింది సిద్దమ్మ.

"నిజం చెప్పయ్యా" అన్నది సిద్దమ్మ.

"బద్ధకంగా వుంటేనూ" అన్నాడు మరిది.

"చెప్పవూ ?" అడిగింది సిద్దమ్మ.

"చెపుతా" అన్నాడు మరిది.

"అతగా డొస్తానన్నది ఇవ్వాళేనా ?"

"ఏడోరోజు; అంటే ఇవ్వాళే. ఒకటి - రెండు - మూడు - నాలుగు - అయిదు - ఆరు - ఏడు" అన్నాడు మరిది.

"ఇంకా రాలేదు" అన్నది సిద్దమ్మ.

"చూడూ ?" అన్నాడు మరిది.

"చూచా !" అన్నది సిద్దమ్మ.

"వొచ్చేముందు కొండమీద దీపం వెలిగిస్తానన్నాడు" అన్నాడు మరిది.

"దీపమా !" అన్నది సిద్దమ్మ.

"దీపమే !" అన్నాడు మరిది.

"మందనష్టపాడు !" అన్నది సిద్దమ్మ మురిపెంగా.

"ఎటు తిరిగితే అటే" అన్నాడు మరిది.

సిద్దమ్మా, మరిదీ కొండవైపు చూస్తూ కిటికీదగ్గర నిలబడ్డారు. ఎంతసేపు చూచినా చీకటినలుపుకంటే కారు నలుపుగా కొండే కనిపిస్తూవుంది.

"ఆరిపోయిందేమో !" అన్నది సిద్దమ్మ.

"అహఁ !" అన్నాడు మరిది.

"గాల్లో దీపం" అన్నది సిద్దమ్మ.

"గుళ్ళో లింగం" అన్నాడు మరిది.

చూచి చూచి కళ్ళు చిల్లులు పడుతున్నై సిద్దమ్మకి. సిద్దమ్మకి కళ్ళల్లో నీళ్ళు తిరిగినై.

రైల్లో గుడ్డివాళ్ళు పాడుకునేపాట జ్ఞాపకం వొచ్చింది

'ఎంతపని చేసితివి, రామా ...

నిన్నేమనందును, సార్వభౌమా ...'

"అదుగో" అన్నాడు మరిది.

"ఏమిటి ?" అడిగింది సిద్దమ్మ.

"కొండమీద దీపం" అన్నాడు మరిది.

సిద్దమ్మ రివ్వున కొండవైపు తిప్పిందితల.

నింజగా కొండమీద దీపం! సిద్దమ్మకి ఈ తడవ ఏపాటా జ్ఞాపకం రాలా.

"ఓ మరిదీ ?" అన్నది సిద్దమ్మ.

"ఏం వొదినా?" అడిగాడు మరిది.

"ఎందుకు దీపం అటూ ఇటూ వూపుతాడు ?" అడిగింది సిద్దమ్మ.

"వొస్తున్నా, వొస్తున్నా అనే గుర్తుకి" అన్నాడు మరిది.

"ముదనష్టపాడు!" అన్నది సిద్దమ్మ మురిపెంగా.

చటుక్కున కొండలమధ్య తుపాకిపేలింది. సిద్దమ్మ గుండె గుభేలుమన్నది.

"ఉంజ్ఞ, ఉంజ్ఞ" అన్నాడు పిల్లవాడు.

సిద్దమ్మ పిల్లవాణ్ణి గుండెలకి హత్తుకుంది.

"మరిదీ, మరిదీ!" అన్నది సిద్దమ్మ.

"ఏం వొదినా ?" అన్నాడు మరిది.

"కొండమీద దీపం?" అన్నది సిద్దమ్మ.

"ఆరిపోయింది!" అన్నాడు మరిది.

"మరి నా సీనడో ?" అంది సిద్దమ్మ.

"ఉంజ్ఞ, ఉంజ్ఞ" అన్నాడు పిల్లవాడు.

మళ్ళీ కొండలమధ్య తుపాకీ పేలింది: మరిది ఉప్పెనకు మల్లే రివ్వున వెళ్ళాడు కొండమీదికి. సిద్దమ్మకి అంతా అయోమయంగావుంది. గుడ్లు అప్పచెప్పి చూస్తూ నుంచుంది.

"ఉంజ్ఞ, ఉంజ్ఞ" అన్నాడు పిల్లవాడు.

"ఉండరా" అన్నది సిద్దమ్మ.

అత్తమామలు ఎవరికళ్లు వాళ్లు నులుముకుంటూ వొచ్చారు. మామకి సిద్దమ్మని పలకరించటానికి భయం వేసింది.

అందుకని వెంకమ్మని పలకరించాడు.

"వెంకమ్మా?" అన్నాడు వెంకయ్య.

"ఏంది ముసలాయనా?" అన్నది వెంకమ్మ.

"మరి గత్తే..." అన్నాడు వెంకయ్య.

"అడుక్కో—" అన్నది వెంకమ్మ.

"ఆ మోత ఎక్కడిదీ అంట!"

"ఏ మోతా?" అన్నది వెంకమ్మ.

"ఇందాకటిదే!" అన్నాడు వెంకయ్య.

"అదా?" అన్నది వెంకమ్మ.

"అదేనే" అన్నాడు వెంకయ్య.

"చెప్పనా ముసలాయనా?"

"చెప్పవే, నా మొహిరీ!"

"చెవ్వేదీ?" అన్నది వెంకమ్మ.

"ఇదిగో" అన్నాడు వెంకయ్య చెవ్వు అందిస్తూ.

"మరే?—" అన్నది వెంకమ్మ చెవులో.

"కొరికేవే, భామా" అన్నాడు వెంకయ్య.

"ఆమోతే—" అన్నది వెంకమ్మ చెవులో.

"ఓసి లలనా, మగువా, సకియా, చెప్పవే" అన్నాడు వెంకయ్య.

"నేను చెప్పను ముసలాయనా" అన్నది వెంకమ్మ.

మళ్ళీ కొండలమధ్య తుపాకులు పేలినై. ఈసారి వొక్కసారి కాదు. వరసనే ఆరుసార్లు. సిద్దమ్మకళ్లు అగ్ని గోళాలయినై. సీనప్ప ఏమయ్యాడు ? మరిది ఏమయ్యాడు? పిల్లవాణ్ణి గుండెలకు అదుముకొని కొండల వైపు పరుగెత్తింది సిద్దమ్మ. చీకటిలో కలిసిపోయింది సిద్దమ్మ.

"వెంకమ్మా!" అన్నాడు వెంకయ్య.

"ఏంది ముసలాయనా ?" అన్నది వెంకమ్మ.

"ఇప్పుడు ఈమోత అనేది వొకటివుంది చూశావూ" అన్నాడు వెంకయ్య.

"చూడకేం ?" అన్నది వెంకమ్మ.

"ఎవరు చేశారో నీకేమన్నా తెలుసటే ?" అన్నాడు వెంకయ్య.

"తెలియకేం?" అన్నది వెంకమ్మ.

"తెలిస్తే చెప్పవే" అన్నాడు వెంకయ్య.

"తొత్తుకొడుకులు కామాలు," అన్నది వెంకమ్మ.

వెంకయ్యకి ఏమీ తోచలేదు. కొంచెంసేపు ఆగి మళ్ళీ అడిగాడు.

"సరే గాని, వెంకమ్మా—"

"అడుక్కో ముసలాయనా" అన్నది వెంకమ్మ.

"గంజేరాకు అంటే ఎందుకే నీకు అంతఇష్టం?" అడిగాడు వెంకయ్య.

"మణేదారు రామయ్యమూలానే కామాలు" అన్నది వెంకమ్మ.

"అంతే అంటావా?" అన్నాడు వెంకయ్య.

"అంతే ముసలాయనా" అన్నది వెంకమ్మ.

ఇంతలో ఒకపోలీసు రొప్పుకుంటూ వచ్చాడు. పోలీసును చూచి వెంకయ్యా, వెంకమ్మా మళ్ళీ మూలకివెళ్ళారు.

పోలీసు బుజంమీద తుపాకివుంది. నెత్తినటోపీ వుంది. కళ్ళేమో చింతనిప్పులలాగ వున్నాయి.

ఇంట్లో అడుగుపెడుతూనే "ఎవరక్కడ?" అన్నాడు పోలీసు.

"కిటికీ" అన్నాడు వెంకయ్యా.

"కాదు, కాదు చీకటి" అన్నది వెంకమ్మ.

"ఏదో వాకటి" అన్నాడు వెంకయ్య.

"సీనప్ప తలిదండ్రులు మీరేనా ?" అడిగాడు పోలీసు.

"ఏమిటే అంటాడు వెంకమ్మా?", అన్నాడు వెంకయ్య.

"ఏందో పాడు" అన్నది వెంకమ్మ.

"చెప్పరేం ?" అన్నాడు పోలీసు కోపంగా.

"చెప్పవే?" అన్నాడు వెంకయ్య విసుగ్గా.

"అడుక్కోమను" అన్నది వెంకమ్మ.

"అడుక్కో, పోలీసూ" అన్నాడు వెంకయ్య.

పోలీసుకి కోపం వచ్చింది. బుజంమీది తుపాకిక్రిందికి దించాడు. నెత్తిమీదిటోపీ చేత్తోపట్టుకున్నాడు. సరే, కళ్లు చింతనిప్పులు.

"మీరేనా సీనప్ప..." అని మొదలుపెట్టాడుపోలీసు.

వెంకమ్మకి తటాలున జ్ఞాపకం వొచ్చింది:

"అయ్యో ముసలాయనా !" అన్నది వెంకమ్మ.

"ఏమిటే వెంకమ్మా?" అన్నాడు వెంకయ్య.

"మన సీనప్ప, ముసలాయనా..." అన్నది వెంకమ్మ. వెంకయ్యని కౌగిలించుకొని బావురుమని ఏడ్చింది. వెంకయ్యకేమీ అర్థంకాలా.

"ఇదేమిటే?" అన్నాడు వెంకయ్య.

"సీనప్పని చంపారు" అన్నది వెంకమ్మ.

"ఆఁ" అన్నాడు వెంకయ్య.

"సీనప్ప తమ్ముణ్ణికూడా ముసలాయనా" అన్నది వెంకమ్మ.

"ఊఁ" అన్నాడు వెంకయ్య.

"సిద్దమ్మనీని" అన్నది వెంకమ్మ.

"అట్టాగటే, భామా" అని తనూ వెక్కి వెక్కి ఏడిచాడు. ఇక ఆ యేడుపు కంతులేదు. ఏడుపు ఆపుకుంటారనే మరిచిపోయాడు వెంకయ్య. ఏడుపే ఏడుపు; ఒకటే ఏడుపు.

"మిమ్మల్ని అరెస్టుచేశాను" అన్నాడు పోలీసు.

"ఉఁజ్ఞ, ఉఁజ్ఞ!" అన్నది వెంకమ్మ.

"అదేమిటే పిల్లా?" అన్నాడు వెంకయ్య.

"సిద్దడు!" అన్నది వెంకమ్మ.

"పదండి" అని తుపాకిమడమతో పొడిచాడు పోలీసు. తుపాకి బుజాన వుంచుకున్నాడు. టోపీ నెత్తినపెట్టుకున్నాడు.

పోలీసుకి కళ్లులేవు; ఉన్నవి చింతనిప్పులు.

శ్రీ ప్రకాశ గ్రంథాలయము
తెలప్రోలు. (కృష్ణా జిల్లా.)

---

నలందా ప్రెస్, తెనాలి జి 93 - కాపీలు 1000 - డి 31-12-46
ఫర్ ప్రజాసాహిత్య పరిషత్ తెనాలి. - జి 79.

అంకితం

హృదయం కోల్పోని

వి ప్ల వ కా రు ని కి

శ్రీ వేమన గ్రంధాలయమ్
తేలప్రోలు. (కృష్ణా జిల్లా.)

| మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక | |
|---|---|
| పుస్తకం సంఖ్య | TPLA130B190 |
| పుస్తకం పేరు | సరె, కానివ్వండి |
| తారీఖు | 30/10/24 |
| ముందు అట్ట | NO |
| వెనుక అట్ట | NO |
| మొత్తం పేజీలు | 103 |
| పెద్ద సైజు పేజీలు | NO |
| ఖాళీ పేజీలు | NO |
| లేని పేజీలు | NO |
| తయారు చేసినది | akshaya |
| పేజీలు విడదీసినది | Bannu |
| స్కాన్ చేసినది | Sreelakshmi |
| పరీక్ష చేసినది | pragathi |
| పేజీలు సరిచూసినది | |
| బైండింగు చేసినది | |
| ప్యాకింగు చేసినది | |
| పరిస్థితి | good |